వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శనివారం 31 మే 2025

## ప్రజాదర్బార్‌లో మంత్రి

**చిన్నమండెం మే 30 ప్రభాతవార్త:**

సామాన్య ప్రజల సమస్యలకు నిబ్బరమైన పరిష్కారం చూపించాలని మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రోజు చిన్నమండెం మండలం బోరెడ్డి గారి పల్లెలోని తన నివాసంలో మంత్రి ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పలు ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల సమస్యలను తెలుసుకుని పరిష్కరించడం జరిగింది.



## బ్రహ్మంగారి సన్నిధిలో వైజాగ్ ఇంటలిజెంట్ ఎస్పీ

**బ్రహ్మంగారిమఠం మే 30 ప్రభాతవార్త:**



భూత భవిష్యత్ వర్తమాన కాల జ్ఞానాన్నీ రచించిన జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాముల వారి దర్శనానికి వైజాగ్ ఇంటెలిజెంట్ ఎస్పీ ఈశ్వరరాజు బ్రహ్మంగారి మఠం మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి ప్రత్యేక స్వాగతం పలికి ఆలయ మర్యాదలతో బ్రహ్మంగారికి ప్రత్యేక పూజలు చేయించి శాలువా కప్పి పూలమాలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఇంటిలిజెంట్ ఎస్పీ ఈశ్వరరాజు మాట్లాడుతూ బ్రహ్మంగారి దర్శనం తో నాజన్మధన్యం అయ్యిందని, స్వామి వారు జరిగేది జరగబోయేది ముందుగా తన కాలజ్ఞానం ద్వారా తెలిపిన గొప్ప మహనీయుడు బ్రహ్మంగారి అని అన్నారు. వీరి వెంట బ్రహ్మంగారిమఠం ఏఎస్ఐ, గుర్రప్ప ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పోయిన ప్రాణం లేచొచ్చింది...

- అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణానికి మరలా ఊపిరి
- రైతుల ఆశలకు బాబు బాసట
- సీఎం నిర్ణయంతో అన్నమయ్య పునర్నిర్మాణానికి ప్రాణం
- సిఎం ప్రకటించిన 24 గంటల్లోపే కదలిక
- ప్రాజెక్టు పునర్ నిర్మాణ సమాచారం పంపాలని ఆదేశం





పోయిన ప్రాణం లేచొచ్చింది... గుండె ఆగినప్పుడు సిపిఆర్ చేస్తే ఎలాగో అలా... అన్నమయ్య ప్రాజెక్టును మరలా నిర్మిస్తారా? సొంత జిల్లాకు చెందిన సీఎం జగనే పక్కన పెట్టారు... ప్రాజెక్టు పరివాహక గ్రామాలన్నీ వైసీపీకి ఓట్లు వేశాయి..! చంద్రబాబు మేము వస్తే ప్రాజెక్టు నిర్మిస్తామని చెప్పినా నమ్మలేదు... అన్నట్టుగానే చంద్రబాబు అధికారంలోకి వచ్చారు. రాజంపేట నియోజకవర్గంలోతెలుగుదేశం ఓడిపోయింది. తనను నమ్మని వారిని నమ్మి బాబు ప్రాజెక్టు కడతారా? మార్చి బడ్జెట్లో ప్రాజెక్టుకు చిల్లిగవ్వ ఇవ్వలేదు!! ఇలాంటి అనుమానాలు రైతాంగంలో ఎన్నో ..? అయితే రాజంపేటలో జరిగిన మినీ మహానాడులో అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు అధ్యక్షతన అన్నమయ్య ప్రాజెక్టును పునర్ నిర్మించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ మినీ మహానాడుకు స్వయంగా రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కూడా రావడం జరిగింది. ఇది చాలావరకు కలిసి వచ్చింది. ఈ తీర్మానాన్ని రాష్ట్ర మహానాడు తీర్మానాల్లో కూడా పొందుపరిచారు. దీన్ని స్వయంగా తెలుగుదేశం పార్టీ అధినేత రాష్ట్రం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చూశారు. అందుకే రాజంపేటలో తెలుగుదేశం ఓడిపోయినా ప్రజలే ముఖ్యం, రైతుల సమస్యలే ప్రధానం అని ఈ అనుమానాలు అన్నింటికీ చంద్రబాబు ఒకే మాటతో సమాధానం చెప్పారు. అన్నమయ్య ప్రాజెక్టులో పునర్ నిర్మించే బాధ్యత కూటమి ప్రభుత్వానిదే అని తేల్చిచెప్పారు. అది కూడా తెలుగుదేశం పార్టీకి ప్రాణప్రదమైన మహానాడు సాక్షిగా ప్రకటించారు.

అందుకే ప్రాజెక్టు నిర్మాణానికి జల వనరుల శాఖలో కదలిక ఏర్పడింది. సీఎం కడప మహానాడులో ప్రకటించిన 24 గంటల్లోపే అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణానికి సంబంధించిన సమాచారం అంతా పంపాలని విజయవాడలోని జల వనరుల శాఖ సిఇ సిడిఓ ఆదేశించింది. ఈ నేపథ్యంలో అన్నమయ్య పునర్నిర్మాణానికి సంబంధించి వార్త అందిస్తున్న ప్రత్యేక కథనం.

**రాజంపేట అర్బన్, మే 30 ప్రభాతవార్త**

అన్నమయ్య ప్రాజెక్టు ఎర్త్ డ్యాం 2021 నవంబర్ 19న భారీ వరదలతో నామరూపాలు లేకుండా కొట్టుకుపోయింది. ఈ వరద విజయానికి 41 మంది జల సమాధి అయ్యారు. మరోసారి ప్రాజెక్టుకు ఈ పరిస్థితి దాపురించకుండా సమగ్ర అధ్యయనం తర్వాత ప్రాజెక్టులు నిర్మించాలని గత వైసిపి సర్కార్ నిర్ణయించింది. నిపుణుల కమిటీని నియమించింది. కమిటీ నివేదికను పరిశీలించింది. కేంద్ర జల సంఘానికి పంపించింది. ప్రాజెక్టు ఎర్త్ డ్యామ్ కొట్టుకపోకముందు స్పిల్ వే,ఐదు గేట్లతో, రెండు గ్యాలరీలు ఉండేవి.1.85 లక్షల క్యూసెక్కుల నీటి విడుదల సామర్థం ఉండేది. కేంద్ర జల సంఘం ఆదేశాల మేరకు నీటి విడుదల సామర్థ్యాన్ని 8.23 లక్షల క్యూసెక్కులకు నిర్దేశించారు. ఈ మేరకు ప్రాజెక్టు అధికారులు పనులు ప్రారంభించిన తర్వాత, తుది పరిశీలనకు రెండు డిజైన్లు పంపారు. ఒక డిజైన్లో ప్రస్తుతం ఉన్న స్పిల్ వే పక్క నుంచి కుడివైపున కొండ వరకు 16 గేట్లను ఏర్పాటు చేసి నీటిని విడుదల చేసేలా కాంక్రీట్ డాం ఏర్పాటు చేయాలని రూపొందించారు. అలాగే ప్రస్తుతం ఉన్న స్పిల్వే పక్కనే రాక్ ఫిల్ డ్యాం నిర్మించి, ఆ పక్కనే 11 గేట్లు కొండ వరకు ఏర్పాటు చేయాలని రెండో డిజైన్ చేశారు. ఈ మేరకు రెండు డిజైన్లను రాష్ట్ర ప్రభుత్వ పరిశీలనకు జిల్లా జల వనరుల శాఖ శాఖ అధికారులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పంపారు. వైసిపి హయాంలో జరిగిన టెండర్లలో హైదరాబాద్ కిందిన రాఘవ ఇన్ఫ్రా సంస్థ అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణ టెండర్లను చేజిక్కించుకుంది. కోటి రూపాయలు మేర పనులు చేసి నిలిపివేసింది. అయితే రాష్ట్ర వ్యాప్తంగా 25 శాతం లోపు పనులు జరగని అన్ని ప్రాజెక్టు పనులను రద్దు చేయాలని కూటమి ప్రభుత్వం ఆదేశించింది. అయితే అన్నమయ్య ప్రాజెక్టు టెండర్లను రద్దు చేశామని మాత్రం జల వనరుల శాఖ నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదని ఇటీవలే జిల్లా ప్రాజెక్టు అధికారులు వార్త కు ధ్రువీకరించారు. ఈ నేపథ్యంలో పాత టెండర్లనే కొనసాగిస్తారా లేక మరల ఫ్రెష్ గా కొత్త టెండర్లను పిలుస్తారా అన్నది ప్రభుత్వం నిర్ణయం మీదే ఆధారపడి ఉంటుంది. ఎందుకంటే మరలా కొత్తగా టెండర్లు పిలిచి, డిపిఆర్ సిద్ధం చేయాలన్న కనీసం ఆరు నెలలు పట్టే అవకాశం లేకపోలేదు. ఆ తర్వాత మరలా కొత్త గుత్తేదారు రావడం ,అగ్రిమెంట్ చేసుకోవడం పెద్ద ప్రక్రియ. ఇప్పటికే ఇన్వెస్టిగేషన్ పనులు దాదాపు పాత కాంట్రాక్టర్ పూర్తి చేశారు. కొత్త కాంట్రాక్టర్ వస్తే ఇన్వెస్టిగేషన్ మొదటికి వస్తుంది. ఇవన్నీ పూర్తి అయ్యే లోపల మరల 2025 26 బడ్జెట్ వస్తుంది. మరలా రెండు ఎస్ ఎస్ ఆర్ రేట్లు మారతాయి. ఇలా సాంకేతికపరమైన ఎన్నో అవరోధాలు కూడా ఉంటాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణానికి సంబంధించి ఎలా ముందుకు వెళుతుందో వేచి చూడాల్సి ఉంది. కాక సీఎం అన్నమయ్య ప్రాజెక్టు నిర్మిస్తామని ప్రకటించిన 24 గంటలలోపు జల వనరుల శాఖ చీఫ్ ఇంజనీరింగ్ డిజైన్స్ కార్యాలయం నుంచి ప్రాజెక్టుకు సంబంధించిన సమాచారాన్ని పంపాలని కోరినట్లు అధికారిక వర్గాల ద్వారా తెలిసింది.

## కడపలో మహానాడు విజయవంతమైంది

**మంత్రులు రాంప్రసాద్‌రెడ్డి, సవిత**



**కడప, మే 30, ప్రభాతవార్త బ్యూరో :**

చరిత్రలో నిలిచిపోయేలా కడప గడపలో నిర్వహించిన టీడీపీ కడప మహానాడు సూపర్ సక్సెస్ అయ్యిందని రాష్ట్ర మంత్రులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, సవిత ఆనందం వ్యక్తం చేశారు. మహానాడు విజయవంతానికి కృషి చేసిన టీడీపీ ఉమ్మడి కడప జిల్లా నాయకులకు, కో ఆర్డినేషన్ కమిటీ సభ్యులకు మంత్రులు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యేలు పుత్తా చైతన్యరెడ్డి, మాధవిరెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డిలతో కలిసి శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహానాడు విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా ధన్యవాదాలు తెలియజేశారు. చరిత్రలో నిలిచిపోయేలా కడప గడపలో టీడీపీ మహానాడు సూపర్ సక్సెస్ అయ్యిందన్నారు. ఉమ్మడి కడప జిల్లా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా, సమన్వయంగా మహానాడును దిగ్విజయంగా నిర్వహించారు. మహానాడు నిర్వహణకు నియమించిన 13 కమిటీ సభ్యులు కూడా ఈ విజయంలో కీలక పాత్ర పోషించారు. మహానాడు విజయవంతమవ్వడంలో తాను కూడా భాగస్వామ్యం కావడం అదృష్టమన్నారు. రాయలసీమను అభివృద్ధి చేసింది... చేస్తుందీ కూడా సీఎం చంద్రబాబునాయుడేనన్నారు. రాయలసీమ అభివృద్ధిపై. సీఎం చంద్రబాబుకు ప్రత్యేక విజన్ ఉందన్నారు. రాయలసీమలో 2019 వరకూ టీడీపీ హయాంలో రూ.13 వేల కోట్లను నీటిపారుదల ప్రాజెక్టులకు ఖర్చు చేశామన్నారు. రాయలసీమ అభివృద్ధి టీడీపీతోనని, రక్తం పారేచోట అభివృద్ధి బాటలు వేయిస్తున్నామని మంత్రులు పేర్కొన్నారు. టీడీపీ మహానాడు విజయంతం కావడంతో కొన్ని దుష్టశక్తులు కుమిలిపోతున్నాయన్నారు. కడప మహానాడుకు రాయలసీమలోని అన్ని నియోజక వర్గాల నుంచి ప్రజలు, టీడీపీ కార్యకర్తలు భారీగా తరలొచ్చారన్నారు. ఈ విజయంతో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో పదికి పది శాసనసభ స్థానాలు కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. మరో పది రోజుల్లో స్టీల్ ప్లాంట్ పనులు మొదలు పెడతామన్నారు. రూ.వెయ్యి కోట్లతో గాలేరునగరి నుంచి కడపకు నీరు తీసుకొస్తామన్నారు. రాయలసీమ బిడ్డగా సీఎం చంద్రబాబునాయుడు ఈ ప్రాంత అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాధవీరెడ్డి, భూపేశ్ రెడ్డి, సీహెచ్ జగన్ మోహన్ రాజు కూడా తదితరులు కూడా పాల్గొన్నారు.

## పీలేరులో మళ్లీ ఏనుగుల కదలికలు



ఏనుగు దాడిలో ధ్వంసమైన అరటి తోట



పొలాన్ని తొక్కిన ఏనుగు అడుగుల జాడలు

**కె.వి.పల్లె, మే 30 ప్రభాతవార్త :**

పీలేరు మండలంలో మళ్లీ ఏనుగుల కదలికలు చోటు చేసుకున్నాయని తెలియడంతో ప్రజలు భయాందోళనకు లోనవుతున్నారు. గురువారం రాత్రి ఓ ఏనుగు మండలంలోని జాండ్ల గ్రామ పరిసర పొలాల్లో ప్రవేశించి, గూడరేవుపల్లి మార్గంలో, పీలేరు తిరుపతి జాతీయ రహదారి దాటి ఎర్రగుంటపల్లి పంచాయతీ పరిసరాల్లో సంచరించినట్లు శుక్రవారం ఉదయం స్థానికులు గుర్తించి పీలేరు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఎర్రావారిపాలెం మండలం, తలకోన అటవీ ప్రాంతం నుంచి ఓ ఏనుగు తమ సమూహం నుంచి దారి తప్పి ఈ ప్రాంతానికి వచ్చి ఉండవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రెండు రోజుల క్రితం ఎర్రావారిపాలెం మండలంలో ఏనుగు దాడిలో అటవీ సిబ్బంది గాయపడినట్లు తెలిసింది. అంతేకాకుండా పీలేరు పట్టణ శివారులోని బందార్లపల్లిలో కొన్ని రోజుల క్రితం ఏనుగుల దాడిలో ఓ రైతు మృతి చెందిన సంఘటన గుర్తుచేసుకుని, ఈ ఒంటరి ఏనుగు పగలు ఎక్కడ తల దాచుకుందో తెలియక, అటు రైతులు తమ పొలాల వైపుకు వెళ్లలేక, ప్రజలు తమ అవసరాల కోసం గ్రామీణ మార్గాల్లో సంచరించలేక భయాందోళనలకు లోనౌతున్నారు. జాండ్ల, గోడరేవుపల్లి పరిసరాల్లో ఏనుగు తిరుగాడిన అడుగుజాడలు కనబడడంతో ఒంటరి ఏనుగు ఆచూకీ కోసం పీలేరు అటవీ శాఖ అధికారులు అన్వేషిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అటవీ అధికారుల బృందం సబిహాసుల్తానా, టి. శ్రీనివాసులు, కె. జగదీష్, డి. చంద్రకళ, బేస్ క్యాంప్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### అంచనాలకు మించి రాజంపేట

# సత్తా చాటాం

**అన్నమయ్య ప్రాజెక్టుపై సీఎం ప్రకటనతో జోష్**

**టిడిపి జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రాజు**

**రాజంపేట అర్బన్, మే30 ప్రభాతవార్త**

మహానాడులో అంచనాలకు మించి రాజంపేట నియోజకవర్గ సత్తా చాటామని, మహానాడు చారిత్రాత్మక ఘట్టంలో లక్షలాది జనంమధ్య అన్నమయ్య డ్యాం నిర్మిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించడంతో రైతులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు చెమట్టి జగన్మోహన్ రాజు అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర రథసారధికి ధన్యవాదాలు తెలిపారు. సీఎం నిర్ణయం తోరాజంపేట అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న విషయం స్పష్టమైందని గుర్తు చేశారు. మహానాడు సక్సెస్ నేపథ్యంలో స్థానిక పార్లమెంట్ పార్టీ కార్యాలయంలో జగన్మోహన్ రాజు కు నియోజకవర్గ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జగన్ రాజు మాట్లాడుతూ మహానాడులో రాజంపేట నియోజకవర్గానికి ఇచ్చిన టార్గెట్ తెలుగు తమ్ముళ్లు అంచనాలకు మించి సత్తా చాటారని అందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామని తెలిపారు. తెలుగుదేశం కుటుంబ సభ్యుల సమిష్టి కృషితోనే జన సమీకరణ సాధ్యమైందని అన్నారు. రాజంపేట నియోజకవర్గం టిడిపికి కంచుకోటని, చిన్న చిన్న పొరపాట్ల వలన ప్రత్యర్థులకు అవకాశం లభిస్తుందని, కలసికట్టుగా పనిచేస్తే రాజంపేటలో టిడిపి ఎలాంటి ఫలితాలు సాధిస్తుందో కడపలో జరిగిన మహానాడులో నిరూపించామని తెలిపారు. రాజంపేటకు కేటాయించిన టార్గెట్ కంటే మించి టిడిపి శ్రేణులు ప్రజలు మహానాడు బహిరంగ సభకు హాజరవడం, మూడు రోజులపాటు కడపలో జరిగిన మహానాడు ను విజయవంతం చేయడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లో సత్తా చాటేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తామని, టిడిపి కార్యకర్తలకు అండగా నిలుస్తామని ఆయన హామీ ఇచ్చారు. రాజంపేట అన్నమయ్య డ్యాం పునర్ నిర్మిస్తామని నిండు సభలో హామీ ఇవ్వడం ద్వారా రాజంపేట మీద ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడుకి, యువ నాయకులు నారా లోకేష్ కి రాజంపేట నాయకులు కార్యకర్తలు ప్రజలు రైతుల తరఫున శతకోటి వందనాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్ రాజు,టిడిపి నాయకులు ఎస్వీ రమణ, కమ్మ సంఘం జిల్లా అధ్యక్షుడు గొల్లపూటి శివ నారాయణ చౌదరి,సుబ్బనరసయ్యనాయుడు, బాపనయ్య నాయుడు, టెక్స్‌మో మల్లికార్జున్, కొల్లి రెడ్డయ్య నాయుడు, వెంకటేష్, దాసరి కళాధర్, ఆర్యవైశ్య సంఘం నాయకుడు రమేష్ టీఎన్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, డిబి ఎన్ పల్లి దివాకర్ నాయుడు, మనుబోలు వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.



మహానాడు సక్సెస్ తో జగన్మోహన్ రాజును సన్మానిస్తున్న పార్టీ నేతలు

### నైరుతీ రుతుపవనాలు

# ముందే ఆగమనం

**ఖరీఫ్ పై అన్నదాతలకు కొండంత ఆనందం**

**ఈ ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయానికి రూ.12,273 కోట్లు రుణాలు సిద్ధం**

**రాజంపేట అర్బన్, మే30 ప్రభాతవార్త**



ఈ ఏడాది నైరుతి ఋతుపవనాలు ముందే ప్రవేశించడంతో అన్నదాతలు ఖరీఫ్ సీజన్ పై కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు. రేపటి నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుంది. అన్నమయ్య ,కడప జిల్లాలోకి ఋతుపవనాలు ప్రవేశించి ఇప్పటికే నాలుగు రోజులు అయింది. ఋతుపవనాల ప్రభావంతో తొలకరి జల్లులు ప్రారంభమయ్యాయి. పలు మండలాల్లో తొలకరికి రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించేందుకు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఎందుకంటే గురువారం అన్నమయ్య జిల్లాలో 15 మండలాల్లో వర్షాలు పడ్డాయి. దీంతో ఖరీఫ్ సేద్యం పనులు ప్రారంభించేందుకు రైతులు నాగళ్లను సిద్ధం చేసుకుంటున్నారు. అన్నమయ్య జిల్లాలో 30 మండలాలు ఉండగా మే నెలలో 19 మండలాల్లో సగటు వర్షపాతం కంటే 20 శాతం ఎక్కువగా నమోదయింది. 11 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదయింది. కేవలం ఎనిమిది మండలాల్లో మాత్రమే వర్షం పడలేదు. గురువారం రాత్రి కూడా గాలివీడులో రాష్ట్రంలోనే అత్యధికంగా 79.2, మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవగా రాయచోట్లో 32.6, రైల్వే కోడూరులో 30, కలికిరిలో 16.2, చిన్నమండెం 9, ఓబులవారిపల్లె 8,పుల్లంపేట 10 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. ఖరీఫ్ సీజన్లో ఎక్కువగా జిల్లాలోని మదనపల్లె ,తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు, రాయచోటి మండలాల్లో ఖరీఫ్ సీజన్లో ఎక్కువగా పంటలు సాగు చేస్తారు. ప్రధానంగా వర్షాధారంగా వేరుశనగ పంటను సాగు చేస్తారు. కడప జిల్లాలో దాదాపు 90 పైబడి పడమటి ప్రాంతాల్లోనే ఖరీఫ్ లో వ్యవసాయ పనులు చేపడతారు. వర్షాధార పండగ వేరుశనగ అధికంగా సాగు చేస్తారు.మూడు రోజుల క్రితం జరిగిన జిల్లా లీడ్ బ్యాంకు సమావేశంలో జిల్లా కలెక్టర్కు బ్యాంకర్లు ఈ ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయానికి గురువుగారు అందజేస్తామని ప్రకటించారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో 12,273 కోట్లు వ్యవసాయ రంగానికి రుణాలు మంజూరు చేసేందుకు రుణ ప్రణాళికలు సిద్ధం చేసినట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరికి వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరంలో కూడా నిర్దేశించిన లక్ష్యం కంటే వ్యవసాయానికి ఎక్కురుణాలు మంజూరు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని 30 మండలాల్లో 126 2024 25 ఆర్థిక సంవత్సరంలో రుణాలు మంజూరు చేసినట్లు లీడ్ బ్యాంక్ మేనేజర్ గణాంకాలు వివరించారు. పదును వర్షం పడితే చాలు ఖరీఫ్ వ్యవసాయ పనులు ఆయా ప్రాంతాల్లో ప్రారంభమవుతాయి. ఈ నెలలో పలు మండలాల్లో అకార వర్షాలు పడ్డాయి. అయితే ఏడాది నైరుతిలో వర్షాలు సగటు కంటే ఎక్కువ పడతాయని భారత వాతావరణ శాఖ వెల్లడించిన నేపథ్యంలో రైతులు ఆశల పల్లకిలో ఉన్నారు. వాతావరణం మారి కారు మబ్బులతో రైతులను ఖరీఫ్ లో మరింత ఊరిస్తోంది.



## వైభవంగా ప్రారంభమైన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

**బద్వేలు అర్బన్ ,మే 30, ప్రభాతవార్త :**



పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బాదిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభయ్యాయి. మొదటి రోజు శుక్రవారం ఉదయం 9 గంటలకు నవకలశ స్నపన అభిషేకం, సాయంత్రం విశ్వక్షేన ఆరాధన,పుణ్యహవాచనము, రక్షా బంధనము, మృత్యుంగ్రహణము, అంకురార్పణ, వాస్తు హోమము, తీర్థ ప్రసాద వితరణ, శనివారం ఉదయం ద్వజారోహణం, కుంభ ప్రతిష్ట, అగ్ని ప్రతిష్ట, నిత్యహోమం, ఉత్సవబలి, సాయంత్రం శేషవాహనం, అలాగే ఆదివారం ఉదయం చతుస్థానార్చన, మూలమూర్తి హోమం, స్వామివారి కళ్యాణం, సాయంత్రం హనుమంత వాహన సేవ, 5,6 తేదిలలో ఉదయం చతుస్థానార్చన మూలమూర్తి హోమం, మహాపూర్ణహుతి, చక్రస్నానము కార్యక్రమాలతో పాటు సాయంత్రం గరుడ వాహన సేవ, ధ్వజారోహనం, రాత్రి 8 గంటలకు పుష్పయాగం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. శని, సోమ, బుధవారాలలో మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, అన్ని 31వ తేదినుంచి 4వ తేది వరకు ప్రతిరోజు రాత్రిఅల్పాహారం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈకార్యక్రమాలకు దేవాదాయశాఖ మంత్రివర్యులు ఆనం రామనరాయాణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త రితేష్‌రెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు తెలిపారు.



# మహానాడు విజయవంతం అయిందంటే కార్యకర్తల కృషి



కమలాపురం జూన్ 30 ప్రభాతవార్త

నగర పంచాయతీలో టిడిపి కార్యాలయంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్త నరసింహారెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానాడు కార్యక్రమాన్ని గత మూడు రోజులగా మన కడప జిల్లాలో నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యకర్తలు కూడా విజయవంతమైనందుకు చాలా సంతోషంగా ఉన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంతో నమ్మకముతో మొదటిసారిగా కడప జిల్లాలో మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించేందుకు మనపై నమ్మకంతో గొప్ప అవకాశాన్ని కల్పించారన్నారు. కమలాపురం నియోజకవర్గంలో కార్యకర్తలందరూ కలిసికట్టుగా ఉంటారని ఆ నమ్మకంతోనే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రి లోకేష్ కూడా మహానాడు విజయవంతం చేసినందుకు చాలా సంతోషించారని అదే విషయాన్ని బహిరంగ సభలో కూడా తెలిపారని ఇంత గొప్పగా నిర్వహించినందుకు అభినందనలు కూడా తెలిపారన్నారు. కమలాపురం ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి తనకు అప్పజెప్పిన బాధ్యతను శ్రమకు ఓర్చి పనులు చేయిస్తూ నిరంతరం పర్యవేక్షించి కార్యకర్తలకు సూచనలు సలహాలు ఇస్తూ అన్ని వసతులు కల్పించారన్నారు స్టేజి ఏర్పాటు సభా స్థలం పరిశీలన గ్రౌండ్ శుభ్రపరచడం వాహనాల పార్కింగ్ తదితర పనులను ఎమ్మెల్యే పుత్త కృష్ణ చైతన్య రెడ్డి దగ్గరుండి చేపట్టారన్నారు. ఈ మహానాడు విజయవంతానికి అధికారులు పోలీసు సిబ్బంది మీడియా ఎంతగానో కృషి చేసిందని వారికి కూడా అభినందనలు తెలుపుతున్నానని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఖాదర్ బాషా రాఘవరెడ్డి ఎల్లారెడ్డి జంపాల నరసింహారెడ్డి దాదిరామయ్య సూర్య సుబ్బారెడ్డి బాబుల్ వెంకటసుబ్బారెడ్డి ఎల్లారెడ్డి మల్లేష్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 4న రాష్ట్ర వ్యాప్తంగా వెన్నుపోటు దినం




కడప కార్పొరేషన్, మే 30 ప్రభాతవార్త:

జూన్ 4న రాష్ట్ర వ్యాప్తంగా వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహిస్తామని వైసిపి జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లి శివప్రసాద్ రెడ్డి లు తెలిపారు. అన్ని నియోజకవర్గాలలో నిరసన ర్యాలీ లు జరుగుతాయన్నారు. స్థానికంగా అధికారులకు ప్రభుత్వం నెరవేర్చని పథకాల అమలుపై వినతి పత్రం అందజేస్తామన్నారు. శుక్రవరం కడప వైకాపా కార్యాలయంలో మీడియాతో వారు మాట్లాడుతూ టిడిపి ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచిన హామీలు నెరవేర్చలేదు. మోసాలకు,కుట్రలకు, అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ సీఎం చంద్రబాబు అని, సూపర్ సిక్స్ పథకాల్లో ఒక్కటైన అమలు చేశారా అని నిలదీశారు. మహానాడుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలను బయపెట్టి , బెదిరించి తరలించారని, అబ్బా కొడుకుల డబ్బా ఎద్దేవ చేశారు. మళ్లీ ఇప్పుడు కొత్తగా ఆరు శాసనాలు అంటూ కట్టు కథలు చెపుతున్నారన్నారు. వైఎస్ జగన్ పై దుష్ప్రచారం తప్ప మహానాడు వల్ల ఒరిగింది ఏం లేదనారు. కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా, ఎమ్మెల్యేలు అమర్నాథ్ రెడ్డి, దాసరి సుధా, ఎమ్మెల్సీలు రామ సుబ్బారెడ్డి, రామచంద్రారెడ్డి, డిసి గోవింద్ రెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు, జిల్లా పరిశీలకులు కొండు అజయ్ రెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, మాజీ టిటిడి బోర్డు నెంబర్ యానాదయ్య, జిల్లా రైతు విభాగమ అధ్యక్షుడు సాంబటూరు ప్రసాద్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, మాజీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్, కార్పొరేటర్లు మహమ్మద్‌షఫీ, శ్రీరంగన్‌రెడ్డి, రామలక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్



సుండుపల్లి, మే 30, ప్రభాతవార్త:

మండల పరిధిలోని మరితాడు సమీపంలోని క్రీడా మైదానంలో చప్పిడి సోదరుల ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి చప్పిడి మహేష్ నాయుడు మరియు తానా అధ్యక్షులు వేమన సతీష్ లు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ క్రికెట్ పోటీలలో క్రీడాకారులందరికి క్రీడా స్ఫూర్తి అవసరమని తెలియజేశారు. ఇందులో భాగంగా మహేష్ నాయుడు ,తానా అధ్యక్షులు వేమన సతీష్ బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడా కారులు ప్రతి పోటీలోనూ గెలుపోటములు సమానంగా తీసుకోవాలని సూచించారు.రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ సుండుపల్లెలో తమ ఆధ్వర్యంలో నిర్వహించడం సంతోషమని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే క్రికెట్ టీములను సాధారణంగా ఆహ్వానించాలని టోర్నమెంట్ నిర్వాహకులకు మహేష్ నాయుడు సూచించారు. టోర్నమెంట్ ప్రారం భంలో తెదేపా నాయకులు పోలి సుబ్బారెడ్డి,శివారెడ్డి, యూనియన్ బాషా తో పాటు, క్రీడా కారులు పాల్గొన్నారు.

# బెంగళూరుకు మరో రెండు క్రొత్త సర్వీసులు



బస్సు కండిషన్ పరిశీలించిన సందర్భంగా డిపిటిఓతో డిఎం తదితరులు

పీలేరు మే 30 ప్రభాతవార్త :

పీలేరు ఆర్టీసీ డిపో నుంచి బెంగళూరుకు త్వరలో మరో రెండు నూతన సర్వీసులు నడపనున్నట్లు అన్నమయ్య జిల్లా ప్రజా రవాణాధికారి రాము తెలిపారు. ఆర్టీసీ గ్యారేజీని ఆకస్మిక తనిఖీలో భాగంగా డిపిటిఓ శుక్రవారం పీలేరు ఆర్టీసీ డిపోకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు ప్రతిరోజూ ఉదయం 4 గంటలకు పీలేరు ఆర్టీసీ బస్టాండు నుంచి యలహంక మార్గంలో బెంగళూరుకు ఓ బస్సు బయలుదేరి వెళుతుందని, తిరిగి అది ఉదయం 10 గంటలకు మెజిస్టిక్ నుంచి బయలుదేరి అదే మార్గంలో పీలేరుకు చేరుకుంటుందని అన్నారు. అలాగే మరో బస్సు ప్రతిరోజు ఉదయం 8 గంటలకు పీలేరు నుంచి బెంగళూరుకు బయలుదేరుతుందని, తిరిగి సాయంత్రం 6 గంటలకు బెంగళూరులోని మెజిస్టిక్ నుంచి బయలుదేరి రాత్రి 10:30 గంటలకు పీలేరుకు చేరుకుంటుందన్నారు. ఈ రెండు సర్వీసులకు అనుమతులు అందిన వెంటనే ప్రారంభించడం జరుగుతుందని డిపిటిఓ చెప్పారు. జిల్లాలో నెలవారీ టోల్ ప్లాజాలకు ఆర్టీసీ రూ.37,68, 550లు చెల్లిస్తోందని అన్నారు. ఓఆర్ సాధనలో అన్నమయ్య జిల్లా రాష్ట్రంలో 18వ స్థానంలో ఉందని, ఎక్కువ ఆదాయం సమకూర్చి జిల్లాను మొదటి పది స్థానాల్లో చేర్చడానికి ఆర్టీసీ ప్రజా రవాణా సంస్థ ఉద్యోగులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మే నెల 29వ తేదీ నాటికి నెలవారి ఈపికె 39.74 శాతం ఉందని చెప్పారు. పల్లె వెలుగు బస్సు సర్వీసులు నడపడానికి ఒక్కొక్క బస్సు కు రోజువారీ రూ.27,000లు ఖర్చు వస్తుండగా, ఒక్కో పల్లె వెలుగు బస్సు ద్వారా రోజువారీ కేవలం రూ. 18,000 మాత్రమే ఆదాయం వస్తోందని తెలిపారు. అదే ఎక్స్‌ప్రెస్ సర్వీసుకు రోజువారి ఖర్చు రూ. 24,000 కాగా దానిపై రూ.25,000లు ఆదాయం వస్తోందన్నారు. సంస్థ ఆదాయాన్ని పెంచేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నట్లు డిపిటిఓ తెలియజేశారు. అనంతరం ఆయన బస్సుల కండిషన్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ నిర్మల, సీఐ సుబ్బమ్మ, ఎంఎఫ్ హరినాథరెడ్డి, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# రూల్స్ అతిక్రమిస్తే చర్యలు తప్పవు,



మైదుకూరు, మే 30, ప్రభాతవార్త:

పట్టణంలో శ్రీకృష్ణ దేవరాయల సర్కిల్ నందు టూవీలర్ వాహనదారులకు ప్రమాదాలపై అర్బన్ సిఐ కె. రమణారెడ్డి పలువురికి అవగాహన కల్పించారు. అంతేకాకుండా వాహనదారులు రూల్స్ అతిక్రమించిన వారికి, మైనర్ విద్యార్థులు, వాహన సంబంధించిన పత్రాలను పరిశీలించారు. హెల్మెట్, త్రిబుల్ రైడింగ్, వారు రూల్స్ అతిక్రమించిన వారికి ఫైన్లు వేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు వేసవి సెలవులు దృశ్య పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని హెచ్చరించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు రాకుండా రహదారిపై తోపుడు బండ్లు, వాహనాలు, షాపు నేమ్ బోర్డు, రహదారిపై ఎక్కడపడితే అక్కడ పెట్టకూడదని అలాంటివి పెట్టినచో కఠిన చర్యలు చేపడతామని తెలిపారు. మున్సిపాలిటీలోని కేశిలింగాయపల్లి పల్లి గ్రామంలో ప్రజలకు చట్టాలపై అవగాహన, స్థానిక సమస్యలపై, గ్రామాలలో కొత్తవారు తిరుగుతున్న, గ్రామంలో గొడవలు జరిగిన పోలీస్ స్టేషన్ తెలియజేయాలని ఎలాంటి గొడవలు పడకుండా సామరస్యంగా గ్రామంలో అందరూ ఐకమత్యంగా ఉండాలని ఏదైనా సమస్యలు ఉంటే పోలీస్ సిబ్బందికి తెలియపరచాలని మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే పరామర్శ

దువ్వూరు, మే 30, ప్రభాతవార్త:



మండల పరిధిలోని చింతకుంట గ్రామ సర్పంచ్ ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొంది ఇంటికి రాగ శుక్రవారం మాజీ ఎమ్మెల్యే రఘురామి రెడ్డి సర్పంచ్ వీరారెడ్డిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్యం పై ఆరాతీశారు. డాక్టర్ లు చెప్పిన సూచనలను పాటించి జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు శ్రీనివాసుల రెడ్డి, ఖాదర్ బాష, శంకర్ రెడ్డి, హరినాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రికి నాగలి బహుమతి



రాజుపాళెం,మే30,ప్రభాతవార్త.

మండల పరిధిలోని కొర్రపాడు గ్రామానికి చెందిన టిడిపి రైతునాయకులు ధనిరెడ్డి సుధాకర్‌రెడ్డి ఎమ్మెల్యే నంద్యాలవరదరాజులరెడ్డి ఆద్వర్యంలో కడపలో జరిగిన మహానాడులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి బహుమతిగా రైతుల తరుపున నాగలిని అందించారు. ఈసందర్భంగా రైతుల సమస్యలను, వ్యవసాయరంగంను బలోపేతం చేయాలని, రైతుల సాగుభూసమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రిని కోరినట్లు ఆయన తెలిపారు. వ్యవసాయరంగం బలోపేతం అయితే అన్నిరంగాలు పుంజుకుంటాయని తన అభిప్రాయంను వెలిబుచ్చాడు.

# నేడు ఇళ్ల వద్దకే పింఛన్లు

కలికిరి, మే 30, ప్రభాతవార్త:

ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో ఈనెల 31నే (శనివారం) ఉదయం పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందని కలికిరి మండలం ఎంపీడీవో మహ్మద్ రియాజుద్దీన్ పేర్కొన్నారు. జూన్ 1వ తేదీ ఆదివారం రావడంతో ప్రభుత్వం ముందు రోజే పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. శనివారం ఉదయం 7 గంటలకే సచివాలయం సిబ్బంది పింఛను దారుల ఇంటి వద్దకే పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని పింఛనుదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# ఆధార్ సెంటర్ త్వరలో ప్రారంభం

కలికిరి, మే 30, ప్రభాతవార్త:

మండలంలోని మర్రికుంటపల్లె గ్రామ పంచాయతీ సచివాలయంలో అతి త్వరలోనే ఆధార్ సెంటర్ ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో మహ్మద్ రియాజుద్దీన్ తెలిపారు. కలికిరి మండల ప్రజల సౌకర్యార్థం మర్రికుంటపల్లె సచివాలయానికి ఆధార్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ మంజూరు చేసి నెలలు గడుస్తున్నా ఆధార్ సెంటర్ ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో వార్త మినీలో ప్రారంభం కాని ఆధార్ సెంటర్ అనే వార్త ప్రచురితమైంది. ఎంపీడీవో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అతి త్వరలోనే మర్రికుంటపల్లె సచివాలయంలో ఆధార్ సెంటర్ ప్రారంభించి ప్రజలకు ఆధార్ సేవలు అందేలా చర్యలు తీసుకుంటానని ఎంపీడీవో తెలిపారు.

# చీకటిపల్లె పంచాయతీలో దాహం దాహం..

కలికిరి, మే 30, ప్రభాతవార్త:

మండలంలోని చీకటిపల్లె పంచాయతీలోని రంగనాథపురం, చీకటిపల్లె దళితవాడలలో గత కొన్ని రోజులుగా మంచినీటి సమస్య తలెత్తడంతో గ్రామస్థులు మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని మంచినీటి సమస్య ఏర్పడడంతో మంచినీటి కోసం వ్యవసాయ బోర్ల వద్దకు మహిళలు పరుగులు తీస్తున్న పరిస్థితి రంగనాథపురంలో చోటు చేసుకుంది. మంచినీటి సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజా ప్రతినిధులకు విన్నవించుకోవాలన్నా స్థానిక ప్రజా ప్రతినిధులు పంచాయతీల్లో అందులోబాటులో లేరని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో రక్షిత మంచినీటి బోరు వేసి మంచినీటి సమస్య పరిష్కరించాలని అధికారులకు మొరపెట్టుకుంటున్నా స్పందన కరవైందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఉన్న వాటర్ ప్లాంటు కూడా నిరుపయోగంగా మారిందన్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి రంగనాథపురం, చీకటిపల్లె దళితవాడలో మంచినీటి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# పాడి రైతులు పశువులు బీమా తప్పనిసరి



సిద్ధవటం మే 30 ప్రభాతవార్త :

పాడి రైతులు పశువుల భీమ చేయించుకొని పాడి పశువుల రైతులు ఎవరైనా ఉంటే తప్పకుండా పశువులకు బీమా చేయించుకోవాలని కడప వెటర్నరీ పశుసంవర్ధక డిప్యూటీ డైరెక్టర్ టి వెంకట రమణయ్య తెలిపారు.మండల కేంద్రమైన సిద్ధవటం పశువైద్యశాలను శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేపట్టి పలు విభాగాల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు ఈ సందర్భంగా వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ వెంకటరమణయ్య మాట్లాడుతూ పాడి రైతులు పశువుల భీమా చేయించుకున్న తర్వాత ఒకవేళ అకస్మాత్తుగా పశువు చనిపోతే పాడి రైతుకు రూ, 30, వేల వరకు బీమా వర్తింపజేస్తుందని, వర్షాల కారణంగా, పశువులకు, దూడలకు, గొంతువాపు వ్యాధి, గొర్రెలకు, చిటుకు రోగం వచ్చిందన్నారు, రైతులు ముందు జాగ్రత్త వహించి, డివిజన్ పరిధిలోని అన్ని పశు వైద్యశాలకు, వ్యాక్సిన్ పంపిణీ చేశామన్నారు, పశు వైద్యశాల సిబ్బంది, విధి నిర్వహణలో సమయపాలన పాటించి తొలకరి వర్షంలో వ్యాక్సినేషన్ పట్ల పశు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది అన్నారు అత్యవసర, వ్యాక్సినేషన్ పశువులకు ఇబ్బంది లేకుండా చూడాలని తెలియజేశామన్నారు అంతేకాకుండా 50 , శాతం, సబ్సిడీతో 2.4 మెట్రిక్ టన్నుల కామధేను, పశువుల దాన ఇవ్వడం జరిగిందన్నారు, మండలానికి 140 మంది పాడి రైతులకు ఈ దానా పంపిణీ చేశామన్నారు, దీంతో పాడి రైతులు చాలా సంతోషాన్ని వ్యక్తం చేశారన్నారు, మరో విడత కూడా త్వరలో వస్తుందని కావలసిన పాడి రైతులకు అందజేస్తామన్నారు కడప డివిజన్ కు జొన్న రకానికి చెందిన 10 మెట్రిక్ టన్నుల గడ్డి విత్తనాలు మంజూరు కావడం జరిగిందని వీటిని 75 శాతం సబ్సిడీతో రైతులకు అందజేస్తామన్నారు కావలసిన పాడి రైతులు గడ్డి విత్తనాలను పొందవచ్చు అని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో కడప డివిజన్ పశుసంవర్ధక శాఖ సహాయకులు శ్రీనివాసులు రెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మీదేవి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు

## మహానాడును విజయవంతం చేసిన అందరికీ ధన్యవాదాలు.

తంబళ్లపల్లె మే 30 ప్రభాతవార్త ః



తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమాన్ని తంబళ్లపల్లె నియోజకవర్గం నుండి నేను ఇచ్చిన పిలుపుకు స్పందించి నా తెలుగుదేశం కుటుంబ సభ్యులు కృషి, పట్టుదలతో ఎన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున విజయవంతం చేసిన ప్రతి తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకి పేరుపేరునా నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తంబళ్లపల్లె టిడిపి ఇంచార్జ్ దాసరిపల్లి జయచంద్ర రెడ్డి తెలిపారు. శుక్రవారం మొలకలచెరువు పార్టీ ప్రధాన కార్యాలయంలో మహానాడు విజయవంతం పై టిడిపి కుటుంబ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. మహానాడు కార్యక్రమానికి నియోజకవర్గంలోని ఆరు మండలాల నుండి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మండల స్థాయి నాయకులు, క్లస్టర్ ఇన్చార్జులు, బూత్ కమిటీ సభ్యులు, కేఎస్ ఎస్ సభ్యులు, ఎన్టీఆర్, బాలకృష్ణ, అభిమానులు కార్యకర్తలు , మహిళలకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా తరలించడంలో కీలక పాత్ర పోషించి నా వెంట నడిచి తంబళ్లపల్లె నియోజకవర్గానికి మహానాడులో గౌరవం నిలిపారని భవిష్యత్తులో మీకోసం నా చివరి రక్తపు బొట్టు ఉన్నంతవరకు మీకే అంకితం అవుతానని భావోద్వేగంతో తెలిపారు. భవిష్యత్తులో ఇదే స్ఫూర్తితో తెలుగుదేశం కుటుంబ సభ్యులు ఐకమత్యంతో తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్ర భాగాన నిలపడానికి మీరు నా వెంట నిలబడి సహకారం అందించాలని కోరారు.

# ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల



(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త )

రాజంపేట అన్నమాచార్య విశ్వవిద్యాలయం ప్రవేశ పరీక్ష మొదటి దశ – 2025 ఫలితాలను శుక్రవారం విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఈ. సాయిబాబా రెడ్డి, సహాయ కులపతి సి. అభిషేక్ రెడ్డిలు సంయుక్తంగా విడుదల చేశారు. ఈ ప్రవేశ పరీక్ష మే 15, 2025న నిర్వహించబడింది. ఈ ప్రవేశ పరీక్షను మొత్తం 1908 మంది విద్యార్థులు రాశారు. అందులో 1239 మంది విద్యార్థులు అర్హత సాధించారు. అర్హత సాధించిన విద్యార్థుల కోసం జూన్ 5, 6, 9 మరియు 10 తేదీలలో కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించబడనుంది. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్. మల్లికార్జున రావు, రిజిస్ట్రార్, అన్నమాచార్య విశ్వవిద్యాలయం, డాక్టర్ ఎస్.ఎం.వి. నారాయణ, ప్రిన్సిపాల్, ఏఐటిఎస్ రాజంపేట, డాక్టర్ బి. జయరామి రెడ్డి, ఉపన్యాసాల డైరెక్టర్ (అడ్మిషన్లు) ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. డాక్టర్ బి. జయరామి రెడ్డి అర్హత పొందిన విద్యార్థులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. వారి భవిష్యత్ విద్యాభ్యాసానికి శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



పీలేరు మే 30 ప్రభాతవార్త :

ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు పొందవచ్చునని పీలేరు ఏడీఏ వైవి. రమణరావు అన్నారు. శుక్రవారం మండలంలోని తలపులలో కేవీకే ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ ఎరువులతో తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడి సాధించవచ్చునని తెలిపారు. ఖరీఫ్ వేరుశెనగ, ఉలవ రకాలు, వాటిని సాగు విధానంపై అవగాహన కల్పించారు. రైతులకు ప్రభుత్వం అందించే రాయితీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగు తడుపు చూడల యాజమాన్యం వల్ల పాడి రైతులకు కలిగే లాబాలు, ఉద్యాన పంటల గూర్చి ఆయా శాఖల అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి టి. సుకుమార్ రెడ్డి. కేవీకే శాస్త్రవేత్త మంజుల, ఏవో రమాదేవి పాల్గొన్నారు.

# శ్రీభద్రకాళి అమ్మవారికి విశేష పూజలు.

చిట్వేలి, మే 30, ప్రభాతవార్త:



పాత చిట్వేలి గ్రామంలోని శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో శుక్రవారం సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. పట్టు వస్త్రాలతో, ప్రత్యేక పూలతో, ఆభరణాలతో అమ్మవారిని దేదీప్యమానంగా అర్చకులు మృత్యుంజయ అలంకరించారు. ఒడి బియ్యంతో అమ్మవారు భక్తులను కటాక్షించారు. ప్రత్యేక అభిషేక, అర్చన, ధూప, దీప నైవేద్యాలతో పాటు సామూహిక కుంకుమార్చన చేపట్టారు. పెద్ద ఎత్తున మహిళలు భక్తులు పాల్గొన్నారు. ఆలయ పెద్దలు తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు.

# ఉపాధి హామీ శ్రామికులతో యోగా



వేంపల్లి: : మే 30 (ప్రభాత వార్త):

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నెల రోజులపాటు యోగంధ్ర 2025 నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా వేంపల్లి ఎంపీడీవో శ్రీమతి కుళ్ళాయమ్మ నందిపల్లి,కత్తలూరు ఉపాధి హామీ శ్రామికులకు యోగ మీద అవగాహన కల్పించి ఆసనాలు,ధ్యానం, ప్రాణాయామం మీద యోగ నిపుణులు రాజశేఖర్ మరియు గంగాధర తో అవగాహన కల్పించారు. యోగ అనేది మన దేశానికి వారసత్వంగా వస్తుంది. భారతీయ జీవన విదానంలో ఒక భాగం అని ఎంపిడివో తెలియజేశారు. ధ్యానం వల్ల మానసిక ప్రశాంతత, దేహ దారుఢ్యం లభిస్తాయని డాక్టర్ వైద్యనాద్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాలుర పాఠశాల పిడి రాజశేఖర్, ఏపీవో పార్వతి, నంది పల్లె పంచాయతీ కార్యదర్శి చరణ్ కుమార్, కత్తలూరు పంచాయతీ కార్యదర్శి శివకుమార్, కత్తలూరు సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు సర్వే



బద్వేలు ,మే 30, ప్రభాతవార్త

సమగ్ర జిల్లా ప్రాజెక్టు, ఎంఈవోలు చెన్నయ్య, ప్రమీలమ్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు సర్వే చేపట్టినట్లు ఐఆర్ పీ లక్ష్మి భాయ్ తెలిపారు. ఇందులో భాగంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తించుటకు డోర్ టూ డోర్ కార్యక్రమం చేపట్టారు. ఈ సర్వే కార్యక్రమం మే 13 నుండి జూన్ 10 వరకు నిర్వహిస్తున్న నట్లు తెలియజేశారు. ఇలా సర్వేలో గుర్తించిన 2 సంవత్సరాలనుండి 18 సంవత్సరాల లో పు ఉండే ప్రత్యేక అవసరాలు గల పిల్లలు, బడి బయట ఉన్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ను గుర్తించడం జూరుగుతుందనీ ,. గుర్తించిన పిల్లలను భవిత కేంద్రం లో ప్రభుత్వ పాఠశాలలో చేర్పించ్చడం జరుగుతుందని ఐ ఈ ఆర్ పీ లక్ష్మి భాయ్ తెలిపారు. దివ్యాంగులు ఈ అవకాశం ను సద్వినియోగం చేసుకొని మీ పిల్లలను పాఠశాలలోనీ భవిత కేంద్రం లో చేర్పించి వారి జీవితాల లో వెలుగు సూచనలు ఇచ్చారు. బద్వేల్ పట్టణంలో ఈ సర్వే జరిగింది.

## మానిటరింగ్ సమావేశాలు నిర్వహించడం మరచిన యంత్రాంగం

పీలేరు మే 30 ప్రభాతవార్త :

మండలంలో ప్రతి నెల నిర్వహించాల్సిన పౌరహక్కుల దినోత్సవం మరియు మండల ఎస్సీ /ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సమావేశాలను అధికారులకు గుర్తు చేస్తే గాని నిర్వహించని పరిస్థితిలో రెవిన్యూ యంత్రాంగం పనిచేస్తున్నది. పీలేరు మండలం రెవిన్యూ అధికారిగా బాధ్యతలు చెప్పట్టిన తహసిల్దార్‌కి ఎస్సీ/ఎస్టీ సంఘ నాయకులు గుర్తు చేస్తే మొదట నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవం వేపులభైలు పంచాయతీలోని రెడ్డివారిపల్లి, రెండవది పీలేరు పట్టణంలో లక్ష్మీపురం మూడవది ముడుపుల వేముల పంచాయతీలోని విద్యానగర్, నాలుగోవది తలుపుల పంచాయితీలోని మేళ్లచెరువు ఎస్సీ గ్రామం నందు ఐదవది బాలంవారిపల్లి పంచాయతీ మొరవపల్లి నందు నిర్వహించడం జరిగింది 10.1.2025 వ తేదిన మండల విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు ఇలా గుర్తు చేస్తే గాని పౌరహక్కుల దినోత్సవం ఎస్సీ / ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సమావేశాలు నిర్వహించే పరిస్థితిలో రెవిన్యూ యంత్రాంగం ఉండడం చాలా బాధాకరం. నిర్వహించిన సమావేశాలకు పూర్తిస్థాయిలో ఆయా శాఖల అధికారులు హాజరు కావడం లేదు జనవరి నెలలో నిర్వహించిన సమావేశంలో కమిటి సభ్యులు అధికారుల దృష్టికి తెచ్చిన సమస్యలను సమావేశం నిర్వహించి ఐదు నెలల కావస్తున్న సమస్యలకు పరిష్కార మార్గం లేదు ఇలా తూతూ మంత్రంగా సమావేశాలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్న అధికారులు దీనిపై జిల్లా కలెక్టర్ గారు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

## మాదకద్రవ్యాల నియంత్రణను

# పటిష్టంగా అమలు చేయాలి



రాయచోటి, మే30 ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా రూపొందించడంలో అధికారులు, పోలీసు శాఖ సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నారు. శుక్రవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో "నేషనల్ నారోటిక్స్ కోఆర్డినేషన్" జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశం ప్రారంభంలో జిల్లా అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి... అజెండా అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమావేశంలో వివరించారు. ప్రధానంగా మాదకద్రవ్యాల నియంత్రణకు జిల్లాలో తీసుకోవాల్సిన అంశాలను కమిటీలో వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మాదకద్రవ్యాల అలవాటుకు ఎవరూ బానిసలు కారాదని ముఖ్యంగా యువత మేలుకొని డ్రగ్స్ ను వదులుకోవాలని, తమ భవితను మంచిగా మలచుకోవాలని సూచించారు. వైద్య ఆరోగ్యం, రెవిన్యూ, విద్య, అటవీ, డ్రగ్ తదితర శాఖల అధికారులు అందరూ పోలీస్ శాఖతో సమన్వయం చేసుకొని మాదకద్రవ్యాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. జిల్లాలోని రెవిన్యూ, మార్కెటింగ్, అటవీ, పోలీస్ అన్ని చెక్‌పోస్టులలో పటిష్ట నిఘా పెట్టాలని సూచించారు. డిగ్రీ, ఇంటర్మీడియట్ కాలేజీల ప్రిన్సిపాల్స్, ఎంఈఓలతో శిక్షణా అవగాహన కార్యక్రమాలు చేయాలని, అలాగే అందరూ వైద్యాధికారులు, ఏరియా హాస్పిటల్స్, సిహెచ్సిలలో ఎక్కడైనా మాదకద్రవ్యాల సేవించి ఎవరైనా వస్తే అలాంటి వారి వివరాలను పోలీస్ శాఖకు అందజేయాలని సూచించారు. అలాగే వీఆర్ఏ, వీఆర్ఓలకు గ్రామాలలో డ్రగ్స్ సేవిస్తున్న వారి వివరాలను తెలియజేసేలా తగు ఆదేశాలు జారీ చేయాలని సబ్ కలెక్టర్లు, ఆర్డీఓ కు సూచించారు. మాదకద్రవ్యాలకు సంబంధించి ఏదైనా సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి చెప్పేలా ప్రజలలో అవగాహన కలిగించాలని సూచించారు. ముఖ్యంగా పాఠశాలలు మరియు కళాశాలల్లో మాదక ద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా అవగాహన కల్పించాలన్నారు. ఎండిపిఎస్ చట్టం యొక్క నిబంధనలపై మరియు మాదక ద్రవ్యాల హానికరమైన ప్రభావాలపై అక్రమ సాగుచే ప్రభావితమైన ప్రాంతంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు, జిల్లాలో డ్రగ్ డిఅడిక్షన్ పునరావాస కేంద్రాల పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఎం. వెంకటాద్రి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలోని రాయచోటి, రాజంపేట, మదనపల్లి డివిజన్లలో 2024 మరియు 2025 లో ఇప్పటి వరకు మొత్తం 26 డ్రగ్ కేసులను రిజిస్టర్ చేసి సుమారు 300 కిలోల గంజాయి పట్టుకున్నామని, 40 మంది నిందితులను గుర్తించామన్నారు. అలాగే 11 మంది రిటైలర్లు, 20 మంది సెల్లర్స్, 99 మంది వినియోగదారులను గుర్తించి కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఎవ్వరైనా మాదకద్రవ్యాల రవాణా మరియు వినియోగం చేసినచో ఎన్డిపిఎస్ చట్టం ప్రకారం శిక్షార్హులవుతారని పేర్కొన్నారు. ఏదైనా సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నెంబర్లు 1972, 1933 లేదా 7382296118కు ఎవరైనా ఫోన్ చేసి సమాచారం తెలపవచ్చునన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

# చరిత్రలో నిలిచిపోయేలా విజయవంతమైన మహానాడు

ప్రొద్దుటూరు మే 30 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా మొట్టమొదటిసారిగా కడపలో చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహించిన మహానాడు విజయవంతమైనదని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మూడు రోజులపాటు మహానాడును కడప గడ్డపై నిర్వహించాలన్న టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నిర్ణయించడం అభినందనీయమన్నారు. గతంలో ఎన్నడూ జరగని రీతిలో మొట్టమొదటిసారిగా కడపలో నిర్వహించిన మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేసిన తెలుగుదేశం పార్టీ నాయకులకు కార్యకర్తలకు అభిమానులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చివరి రోజు ఐదు లక్షల మందితో గొప్ప బహిరంగ సభ నిర్వహించి పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు మన్ననలు పొందడం సంతోషకరమన్నారు. దేశవ్యాప్తంగా మహానాడు కార్యక్రమానికి వచ్చిన టిడిపి శ్రేణులు కడప ఆతిథ్యాన్ని స్వీకరించి తమ ఆత్మ సంతృప్తిని వ్యక్తం చేయడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. వాహనాలు అధికంగా రావడంతో కొంత ట్రాఫిక్ జామ్ అయిన మాట వాస్తవమన్నారు. చివరకు పోలీసుల జోక్యంతో ట్రాఫిక్ అంతరాయం లేకుండా మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేశారన్నారు. ఈ మహానాడు కార్యక్రమంలో ఎన్నో ఏళ్లుగా కడప ఉక్కు కర్మాగారం నిర్మాణం



పనులు నిలిచిపోయిన నేపథ్యంలో జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 10 రోజులలో ఉక్కు కర్మాగారం నిర్మాణపు పనులు ప్రారంభిస్తున్నట్లు ప్రకటించడం రాయలసీమ ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టినట్లు అయిందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇంత గొప్ప మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం కావడానికి వ్యక్తి ఉత్సాహంతో తరలివచ్చిన ప్రజలకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో సూపర్ అమలు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడానికి ఆయన కొనియాడారు. ఈ సమావేశంలో లక్ష్మి పేట గురివి రెడ్డి రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి కార్యకర్త మృతి

లక్కిరెడ్డిపల్లి మే 30 ప్రభాత వార్త

కడపలో జరిగిన తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమానికి గురువారం వెళ్లి సంతోషంగా ఇంటికి వచ్చి అర్ధరాత్రి ఒక్కసారిగా కుప్పకూలి గుండెపోటుతో పెద్ద రెడ్డి రంగారెడ్డి50 మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఈ సందర్భంగా పెద్దరెడ్డి కుటుంబం తెలుగుదేశం పార్టీకి పూర్వకాలం నుంచి అనుబంధం ఉండడంతో గురువారం కడప మహానాడు కి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందడం చాలా బాధాకరమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. పందేలపల్లి గ్రామం గుండ్ల చెరువు స్వగ్రామానికి వెళ్లి ఆయన పార్థవ దేహాన్ని పరిశీలించి కుటుంబాన్ని పరామర్శించి పెద్ద రెడ్డి రంగారెడ్డి కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని ఆయన తెలియజేశారు ఈ కార్యక్రమంలో మండల టిడిపి యువజన నాయకుడు యనమల మదనమోహన్ టిడిపి కార్యకర్త మోగి వెంకటరమణ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



## మహాభారతానికి 1లక్ష 50, వేలు విరాళం



చిన్నమండెం, మే 30 ప్రభాతవార్త :

మండలంలోని, కొత్తపల్లి కస్పానందు జరిగే మహాభారతానికి మంత్రి సతీమణి హరితమ్మ, మేనల్లుడు మోర్యారెడ్డి భోజన వసతులకు సంబంధించి లక్ష 50 వేల రూపాయలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా హరితమ్మ మాట్లాడుతూ మండలంలో జరిగే మహాభారతానికి ప్రజలు విశేష సంఖ్యలో హాజరు కావడం జరుగుతుందని ఇక్కడికి వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలవకుండా తగు ఏర్పాట్లు చేయాలని మహాభారతం నిర్వహకులకు సూచించారు. ముఖ్యంగా దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు భోజన వసతులు మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కారు బోల్తా ఒక్కరు మృతి నలుగురికి గాయాలు

కురబలకోట, మే 30 ప్రభాతవార్త



మండలంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదం లో ఒకరి మృతి, మరో నలుగురు గాయపడిన సంఘటన జరిగింది. అన్నమయ్య జిల్లా రాయచోటి లోని లక్ష్మి థియేటర్ వద్ద కాపురం ఉన్న నవాజ్ (24) ఈ ప్రమాదంలో మృతి చదగా మహమ్మద్ అలీ ఖాన్(24) ముజామల్ (23), ఖాదర్ ఖాన్ (24), సుహేల్ (25)లు గాయపడ్డారు. సుహేల్ కువైట్ నుంచి గురువారం రాత్రి బెంగళూరుకు వచ్చాస్నేహితులతోచి స్నేహితులతో కలసి రాయచోటికి వస్తుండగా కురబలకోట వద్ద కారు ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నవాజు మృతి చెందాడు. నవాజ్ మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారు. గాయపడ్డ వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజా సంక్షేమం కోసమే డీలర్ల ద్వారా నిత్యవసరాలు పంపిణీ

తంబళ్లపల్లె మే 30 ప్రభాతవార్త ః

గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన నిత్యవసర సరుకుల పంపిణీ కోసం ఏర్పాటు చేసిన ఎండియు వాహన వ్యవస్థతో పేదల బియ్యం అక్రమార్కుల పాలై సామాన్య ప్రజలు నిత్యావసర సరుకుల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని బియ్యం అక్రమ రవాణా నివారణతో పాటు ప్రజల సౌకర్యార్థం కూటమి ప్రభుత్వం తిరిగి డీలర్ల ద్వారానే రేషన్ సరుకులు పంపిణీ చేపడుతున్నట్లు తంబళ్లపల్లె టిడిపి ఇన్చార్జి దాసరిపల్లి జయ చంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ములకలచెరువు పార్టీ ప్రధాన కార్యాలయంలో నియోజకవర్గంలోని రేషన్ డీలర్లు జయ చంద్రారెడ్డిని దుశ్శాలువులు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి కూటమి ప్రభుత్వం లో నిత్యవసర సరుకుల పంపిణీ వ్యవస్థ పటిష్టంగా నిర్వహించడంతోపాటు అక్రమాలకు చోటు లేకుండా తీసుకున్న నిర్ణయం ప్రజలు తోబాటు డీలర్లు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో రేషన్ డీలర్లు ప్రజలకు సకాలంలో నిత్యవసర సరుకులు పంపిణీ చేపట్టి ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులకు మానవతా దృక్పథంతో వారి ఇండ్ల వద్దకే సరుకులు చేర్చాలన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వంలో ఏ కార్యక్రమం చేపట్టినా అవినీతి, అక్రమాలకు చోటు లేద



ని పారదర్శకంగా నిష్పక్షపాతంగా ప్రజాసేవకే మా పాలన అంకితమని ధీమాగా చెప్పారు. రేషన్ డీలర్లు సైతం కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు,జనసేన అధినేత పవన్ కళ్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్, జయ చంద్రారెడ్డికు కృతజ్ఞతలు తెలిపారు. నిత్యవసర సరుకుల పంపిణీ వ్యవస్థలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పంపిణీ చేస్తామని రేషన్ డీలర్లు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తంబళ్లపల్లె నియోజకవర్గం లోని స్టోర్ డీలర్లు పాల్గొన్నారు.

## మహానాడుకు భారీగా తరలిన టిడిపి నాయకులు



ప్రొద్దుటూరు, మే 30, ప్రభాతవార్త :

ప్రొద్దుటూరు మున్సిపల్ పరిధిలోని 30,31 వార్డుల నుంచి టిడిపి నాయకులు మార్తల గురివి రెడ్డి, మీగడ చంద్రశేఖర్ రెడ్డిల ఆధ్వర్యంలో గురువారం మహానాడుకు స్థానిక వరలక్ష్మి అపార్ట్మెంట్ వద్ద నుంచి బస్సులను ప్రారంభించి భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, నంద్యాల కొండారెడ్డిల ఆధ్వర్యంలో తమ వార్డుల నుంచి మూడు బస్సులతో భారీగా జనాన్ని సేకరించి కడపలో ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న మహానాడును దిగ్విజయంగా జరిగేందుకు తమ వంతు కృషిగా జన సమీకరణ చేసి తమ అభిమానాన్ని చాటుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీలర్ చెన్నారెడ్డి, భాస్కర్ రెండు వార్డుల కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## యోగాతో మానసిక, శారీ రక ఆరోగ్యం



రామసముద్రం మే 30 ప్రభాతవార్త

యోగాంధ్ర లో భాగంగా శుక్రవారం జడ్పీ హైస్కూల్ ప్రాంగణం లో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా ట్రైనర్ పీడీ చంద్ర శేఖర్, యోగా ప్రాముఖ్యతను తెలుపుతూ యోగా శిక్షణ కూడా ఇవ్వడం జరిగింది.ఎంపిడిఓ భానుప్రసాద్ మాట్లాడుతూ మానసిక, శారీరాకారోగ్యానికి అత్యవసరమన్నారు. యోగా ను ప్రతి ఒక్కరూ నిత్యం చేయాలన్నారు. ప్రతి రోజు యోగా చేయడం ద్వారా ఒత్తిడిని అధిక మించి మానసికంగా ఉల్లాసంగా ఉండొచ్చన్నారు. యోగాలో అనేక రకాలుంటాయని వాటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. యోగాతో మంచి జీవన శైలి అవర్చుకోవచ్చన్నారు. రోజూ యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నా ఎంపిడిఓ భాను ప్రసాద్,డాక్టర్ లీల పీడీ చంద్రశేఖర,పీడీ వంశీ సచివాలయం సిబ్బంది,సి హెచ్ ఓ ఉమాదేవి, మండలంలోని సి హెచ్ ఓ లు,ఏ ఎన్ ఎంలు, ఆశ వర్కర్స్, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ కుటుంబాలు



పులివెందుల,మే30, ప్రభాత వార్త:

వైసీపీకి చెందిన 30 కుటుంబాలు శుక్రవారం టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. పులివెందుల పట్టణంలోని స్థానిక సరస్వతీ విద్యా మందిరం వెనుక ఉన్న అయిషా మజీద్ విధి లో నివాసం ఉంటున్న షేక్. భాషా (వేల్పుల భాషా ) యొక్క కుటుంబాలు అతని అనుచరుల సభ్యులు రఫీ, వల్లి, మాబాషా, షబ్బీర్, భాషా, బాబా వల్లి, హారీష్, మహమ్మద్, కరీముల్లా, సత్తార్, ఇమాంబి, సాధాకున్, మున్ని, షబానా, ఖాజాబీ, గౌసియా, తస్లిమ్ లతో కలిసి వైస్సార్సీపీ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. నియోజకవర్గ ఇంచార్జ్ మారెడ్డి. రవీంద్రనాథ్ రెడ్డి టీడీపీ లోకి చేరిన వారిని రాష్ట్ర హచ్ కమిటీ డైరెక్టర్ షేక్.మహబూబ్ బాషా,పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ ఖాసిం వల్లి ల ఆధ్వర్యంలో టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం బీటెక్. రవి మాట్లాడుతూ వార్డులో ఉన్న సమస్యలని పరిష్కరించే దిశగా వార్డ్ అభివృద్ధి కోసం కష్టపడి వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరు పని చేయాలనీ టీడీపీ పార్టీ లో కొత్తగా చేరినటువంటి వేల్పుల భాషాతో పార్టీలో చురుగ్గా పని చేయాలనీ కష్టానికి తగ్గ ఫలితం ప్రతి ఒక్కరికి దక్కుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మైనార్టీ సోదరులు, తదితరులు పాల్గొన్నారు.

## పల్లా శ్రీనివాసరావును కలిసిన సిద్ధవటం నేతలు

సిద్ధవటం మే 30 ప్రభాతవార్త



తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంటరీ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావును కడప విమానాశ్రయం నందు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసిన సిద్ధవటం మండలం తెలుగుదేశం పార్టీ నేతలు వారు మాట్లాడుతూ జిల్లాలో నిర్వహించిన మహానాడు కార్యక్రమం ఎంతో ఘనంగా ముగిసింది అని మహానాడు చివరి రోజున భారీ బహిరంగ సభ కు ఊహించనంత విధంగా తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు జయప్రదం చేశారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శనివారపు మోహన్ రెడ్డి , మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, జవహర్ భాష, సర్పంచి ప్రతినిధి, తుర్రా ప్రతాప్ నాయుడు, ఉప సర్పంచ్ ప్రతినిధి, నాగం నరసింహారెడ్డి, మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పుత్త బాబు, శీను, విజయ్, రమణ, తదితరులు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## వైయస్సార్‌ను అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేయద్దు



మీడియాతో మాట్లాడుతున్న బీటెక్ రవి

పులివెందుల,మే30, ప్రభాతవార్త:

దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని అడ్డుపెట్టుకుని వైసీపీ నాయకులు రాజకీయాలు చేయద్దు అని, వైఎస్ఆర్ అంటే మాకు కూడా ఎంతో అభిమానం అని పులివెందుల నియోజకవర్గ ఇంచార్జి మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. శుక్రవారం రింగ్ రోడ్డులలో మహానాడు సందర్భంగా కట్టిన తెదేపా జెండాలు తోరణాలను దగ్గరుండి తొలగింప చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పులివెందుల రింగురోడ్డు చుట్టూ వైఎస్ఆర్ విగ్రహాలు అమర్చారు అని మేము ఎక్కడ కట్టుకోవాలి అని కేవలం అనంతపురం నుంచి వచ్చే శ్రేణులకు అవగాహన కోసం ఒక మూడు రింగ్ రోడ్డులలో మాత్రమే కట్టినామన్నారు. నిజమైన వైయస్సార్ అభిమానులు ఒక్కసారి ఆలోచించాలన్నారు. వైయస్ విజయమ్మపై కేసు నమోదు చేయించిన వారెవరు, న్యాయబద్ధంగా షర్మిలాకు రావాల్సిన ఆస్తిని రాకుండా చేసింది ఎవరు, రాజశేఖర్ రెడ్డి రాముడైతే లక్ష్మనుడులాగా పనిచేసిన వ్యక్తి వైఎస్ వివేకానంద రెడ్డి అని వైయస్ వివేకానంద రెడ్డిని హత్య చేసిన కేసులో అభియోగాలు ఎవరు ఎదుర్కొంటున్నది ఎవరో ఆలోచించాలి అన్నారు. బనకచెర్ల ప్రాజెక్టు పూర్తి అయితే రాయలసీమ అనేది సస్యశ్యామలం అవుతుందన్నారు. రాయలసీమ మీద సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారన్నారు. వైసిపి శ్రేణులు కవ్వింపు చర్యలకు పాల్పడితే ఇటువైపు చేతులు కట్టుకొని ఉండమని వారికి తగిన బుద్ధి కచ్చితంగా చెప్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెదేప నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మిట్స్‌లో భాష సాహిత్యంపై వర్క్‌షాప్స్



కురబలకోట, మే 30 ప్రభాతవార్త

మదనపల్లె సమీపం లోని మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ లోని ఇంగ్లీష్ ఫారిన్ లాంగ్వేజెస్ విభాగం వారు భాష మరియు సాహిత్యం పై రెండు రోజుల అంతర్జాతీయ సమావేశం మరియు వర్క్‌షాప్‌లను నిర్వహించినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పీ. రామనాథన్ అన్నారు. సాహిత్యం మరియు భాషా పరిశోధనలో ఉద్భవిస్తున్న పరిశోధకులు మరియు విద్యార్థులు ఆంగ్ల సాహిత్యం, భాషా బోధన మరియు భాషాశాస్త్రంలో సమకాలీన ధోరణులపై లోతైన విద్యా చర్చలలో పాల్గొనడానికి అంతర్జాతీయ వేదికను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది అన్నారు. ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ ను సాహిత్యం తో జత పరుస్తూ బాషా బోధన ను ముందు కు తీసుకువెళ్లడమే ఈ సమేవేశం ముఖ్య ఉదేశ్యం. వేగంగా అభివృద్ధి చెందుతున్న డిజిటల్ యుగంలో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైన్స్ మరియు టెక్నాలజీ భాష మరియు సాహిత్యంతో కలిసిపోవడం విద్యా రంగాన్ని పునర్నిర్మించడమే కాకుండా విద్యార్థులు మరియు విద్యావేత్తలు భాషతో సంభాషించే మార్గాలను కూడా పునర్నిర్వచిస్తోంది అని అన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మరియు వైస్ ప్రిన్సిపాల్ ప్రోసీడింగ్స్ ను ఆవిష్కరించారు. తరగతి గదిలో, ఏఐ ఆధారిత అభ్యాస వేదికలు విద్యార్థుల విభిన్న అవసరాలు మరియు నైపుణ్య స్థాయిలను తీర్చే అనుకూలీకరించిన పాఠ్య ప్రణాళికలను అనుమతిస్తాయి అని అన్నారు. ఇంగ్లీష్ విదేశీ భాషల విభాగానికి చెందిన అధ్యాపకులు మరియు విద్యార్థులు, విభాగాధిపతి డాక్టర్ పి. అథహార్ ఇందులో పాల్గొన్నారు.

## వైయస్సార్‌కు వైసీపీకి అసలు సంబంధమే లేదు

పులివెందుల,మే30, ప్రభాత వార్త:



దివంగత నేత వైయస్సార్ రాజశేఖర్ రెడ్డి కి వైకాపా పార్టీకి ఎటువంటి సంబంధం లేదని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వాడిని ఆయనంటే మాకు కూడా అభిమానమేనని వైయస్సార్ అందరివాడు అని టీడీపీ మాజీ పట్టణ అధ్యక్షులు మద్దూరు వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం సర్కిల్ వద్ద మహానాడు సందర్భంగా కట్టిన తెదేపా జెండాలను బీటెక్ రవి ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు తొలగింపు ప్రక్రియ చేపట్టారు ఈ సందర్భంగా మీడియాతో మాజీ పట్టణ అధ్యక్షులు మద్దూరు వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని పులివెందులలోనే అందరు వైసీపీ నాయకులు ఒక విషయం తెలుసుకోవాలని వైయస్సార్‌కు వైకాపాకు ఎటువంటి సంబంధం లేదని ఆయన కాంగ్రెస్ పార్టీ నాయకుడన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. పులివెందులలో చుట్టూ అనుమతులు లేకుండానే ఇస్తారాజ్యంగా వైయస్సార్ విగ్రహాలు పెట్టడం జరిగిందని త్వరలోనే పురపాలక శాఖ మంత్రి దృష్టిది మరియు సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్లి అనుమతులు లేని చోట విగ్రహాలను తొలగించేందుకు ప్రయత్నిస్తామన్నారు. సర్కిల్లో వద్ద వైకాపా వాళ్ల జెండాలు కట్టడం మానేస్తే మేము కూడా కట్టకుండా ఉంటామన్నారు. కావున వైసిపి శ్రేణులు వైయస్ ఆర్‌ను అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయడం మానాలన్నారు. అనవసరంగా జండాలు తొలగించి కవ్వింపు చర్యలకు పాల్పడిన వైసీపీ నాయకులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మదనపల్లి మే 30 ప్రభాతవార్త

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషా సూచించారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వెలుగు రెడ్డమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. తొలిత అన్ని శాఖల అధికారుల ద్వారా గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులు, ప్రజలను వచ్చిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ఎలాంటి సమస్యలు విన్నవించినా గడువు ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పుకోకుండా ఎప్పుడు కప్పుడు పరిష్కారానికిచర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వేగవంతం చేయాలన్నారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. గ్రామాల్లో ప్రజా అవసరాల మేరకు అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తాజ్ ముస్రూర్, సూపరింటెండెంట్ మస్తాన్, తాసిల్దార్ ధన ఆంజనేయులు, సర్పంచులు ఎంపీటీసీలు అధికారులు పాల్గొన్నారు.

## ముంపు ప్రాంతాల పరిశీలన

సిద్ధవటం మే 30, ప్రభాతవార్త:



డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు అన్నమయ్య ప్రాజెక్టు ముంపు గ్రామాల్లో రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ జనసేన నాయకులు యల్లటూరు శ్రీనివాసరాజులు సుడిగాలు పర్యటన చేశారు. ఇందులో భాగంగా బాధితుల ఇంటింటికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకుని ఒక నివేదికను తయారు చేశారు. ఈ సందర్భంగా అధికారి కృష్ణ మాట్లాడుతూ ముంపు ప్రాంతాల్లో మౌలిక వసతులు ఏర్పాటుకు త్వరలో చర్యలు తీసుకుంటామని చెప్పారు. గతంలో ముంపు గ్రామాల్లో పర్యటించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈరోజు ముంపు గ్రామాలైన పులపతూరు,తొగురుపేట, మందపల్లి హరిజనవాడ తదితర గ్రామాల్లో పర్యటించి సమస్యలపై పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామన్న గత వైసిపి ప్రభుత్వం ఇసుక కోసం టిప్పర్లు జెసిపిలు పెట్టి వందలాది టిప్పర్లు ద్వారా ఇసుకను తరలించి సొమ్ము చేసుకున్నారు. ప్రత్యేక నివేదికను తయారుచేసి పవన్ కళ్యాణ్‌కు పంపిస్తున్నామని బాధితులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శివరామరాజు తాతంశెట్టి నాగేంద్ర లతోపాటు స్థానిక జన సైనికులు సౌకర్యాలు కల్పించాలన్న దాని పై సమగ్ర నివేదిక డిప్యూటీ సీఎంకు సమర్పిస్తామన్నారు. ఇటీవల చనిపోయిన జనసేన కార్యకర్త కేశవ కుటుంబాన్ని పరామర్శించిన నేతలు. జనసేన నాయకులు ఈ కార్యక్రమ అతికారి చిన్న వెంకటయ్య కొట్టే శ్రీహరి విజయ్ శ్రీకాంత్ మహబూబాషా తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి మహంకాళి అమ్మ జాతర

పెనగలూరు మే 31 ప్రభాతవార్త



నేటి నుంచి బెస్తపల్లిలో మహంకాళి అమ్మ జాతర మండల పరిధిలోని బెస్త్ పల్లి గ్రామంలో శనివారం సాయంత్రం నుంచి ఉజ్జయిని మహంకాళి అమ్మ జాతర ప్రారంభమవుతుందని నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం గ్రామ పొలిమేరలో నుండి పోతుల రాజుతో కలిసి గంగమ్మ ఊరేగింపుగా గ్రామంలోకి ప్రవేశిస్తుందన్నారు. తెల్లవారుజాము సమయానికి మహంకాలమ్మ దేవాలయం ఊరేగింపు చేరుకుంటుందన్నారు. తెల్లవారుజాము నుండి గ్రామ పురవీధులలో మహంకాళి అమ్మ జాతర ప్రారంభమవుతుందన్నారు. మధ్యాహ్నం జాతరలో పాల్గొన్న భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయబడు తుందని తెలిపారు.

## క్వార్టర్సకు మరమ్మతులు చేయించాలి





నిరసన తెలుపుతున్న దృశ్యం

మదనపల్లి మే 30 ప్రభాతవార్త

మున్సి పాలిటీలో పారిశుధ్య పనులు చేస్తున్న పర్మినెంట్ కార్మికులు చలపతి రావు కాలనీలో నివాసముంటున్న కోటర్స్‌ను కమీషనర్ పరిశీలన చేసి పాడైపోయిన కోటర్స్‌ను మరమ్మతులు చేయించాలని, డైలీ వేజెస్ పారిశుధ్య కార్మికులకు ఐదు నెలల వేతనాలు చెల్లింపులో అలసత్వానికి కారనం అవుతున్న ఆడిటర్ పై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ అనుబంధమైన మదనపల్లి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శిలు మస్తాన్ చలపతి నాయుడు కోరారు శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్మినెంట్ పారిశుధ్య కార్మికులకు హెచ్ ఆర్ ద్వారా కోటర్స్ కు మున్సిపాలిటీకి అద్దె చెల్లిస్తున్నారని కోటర్స్ పాడై పోయి వర్షాలకు నీరుకారుతున్నాయని కమీషనర్ పర్మినెంట్ కార్మికుల కోటర్స్‌ను పరిశిలన చేసి పాక్షికంగా దెబ్బతిన్న వాటికి మరమ్మతులు చేయించాలని కోరారు. ఆప్కాస్ కార్మికులకు ఈపిఎఫ్ సమస్యలు పరిష్కారం చేయాలని సంబంధిత అధికారులను కోరుతున్న పరిష్కారం చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఐదు నెలలుగా వేతనాలు రాక వారి కుటుంబ పోషణ అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారని, ఇంటి అద్దెలు చెల్లించక ఇంటి యజమానులు ఇళ్ళను ఖాళీ చేయాలని ఒత్తిడి తెస్తూ ఇబ్బందులు పడుతున్నారని, కార్మికులకు వేతనాలు చెల్లించడంలో ఆలస్యానికి కారణం అవుతున్న ఆడిటర్ పై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకొని డైలీ వేజెస్ పారిశుధ్య కార్మికులకు పెండింగ్లో ఉన్న ఐదు నెలల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మదనపల్లి పట్టణ కార్యదర్శి తిరుమల, కృష్ణప్ప, జానకి, దేవా, సంజీవ, వాసు,చంద్ర, ఇంద్రాణి, రాధా, తదితరులు పాల్గొన్నారు.

## నిత్యవసరాల పౌరసరఫరాల గోడౌన్ ప్రారంబించండి

తంబళ్లపల్లె మే 30 ప్రభాతవార్త ః

తంబళ్లపల్లె నియోజకవర్గ కేంద్రంలోని పౌరసరఫరాల గోడౌన్ నిర్మాణం పూర్తయిన ప్రారంభానికి నోచుకోక పోవడం విచారకరం. గత నాలుగు దశాబ్దాలకు పైగా పౌరసరఫరాల గోడౌన్ గతంలో తాసిల్దార్ కార్యాలయంలోనే నిర్వహిస్తూ వచ్చేవారు. గత పది సంవత్సరాలుగా తాసిల్దార్ కార్యాలయం వర్షానికి తడవడం అందులోని నిత్యవసర సరుకులు బియ్యం, పప్పులు ఇతర సరుకులు తడిసి పనికిరాకుండా పోవడం పలుసార్లు జరిగింది. అనంతరం ఇది లేని పరిస్థితిలో మండల కేంద్రంలో పలుచోట్ల ప్రైవేట్ గోడౌన్లలో పౌరసరఫరాల నిర్వహణ కార్యక్రమం జరిగినా సఫలీకృతం కాలేదు. ఈ సమస్య పరిష్కారానికి గత రెండేళ్ల ఏళ్ల క్రితం పాత హై స్కూల్ భవనం పక్కనే గోడౌన్ నిర్మాణం చేపట్టి దాదాపు పూర్తయింది. అయినా గోడౌన్ ప్రారంభించకపోవడం నేటికీ అద్దె గోడౌన్లో నిత్యవసర సరుకుల పంపిణీ జరుగుతోంది. లక్షల రూపాయల తో నిర్మించిన గోడౌన్ ప్రారంభించకపోగా అద్దె గోడౌన్లో నిత్యవసర సరుకులు పంపిణీ జరగటం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గోడౌన్ ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.



## దళిత గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

పీలేరు మే 30 ప్రభాతవార్త :

దళితుల సంక్షేమం, దళిత గ్రామాల అభివృద్ధే ప్రభుత్వం ధ్యేయంగా పెట్టుకుందని పీలేరు మండల తహశీల్దారు భీమేశ్వరరావు, ఎంపీడీవో శివశంకర్ తెలిపారు. శుక్రవారంపీలేరు మండలం, తలపుల పంచాయతీ, పెద్ద హరిజనవాడ లో పౌరహక్కుల దినం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామానికి స్మశాన స్థలం, రోడ్డు సౌకర్యం, వీధి లైట్లు కల్పించాలన్నారు. అర్హులకు ఇంటి పట్టాలు, పెన్షన్లు మంజూరు చేయాలని కూడా కోరారు. ఈ సందర్భంగా తహశీల్దారు, ఎంపీడీవో స్పందిస్తూ తమ దృష్టికి వచ్చిన సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఎస్ఐ లోకేష్, హౌసింగ్ డీఈ రమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.



## నేటి నుంచి ఎల్లమ్మ తిరుణాల

పెనగలూరు మే 30 ప్రభాతవార్త



మండల కేంద్రంలోని పెనగలూరు గ్రామంలో కలసి ఉన్న గ్రామ దేవత శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి తిరుణాల మహోత్సవం శనివారం సాయంత్రం నుండి ప్రారంభమవుతుందని గ్రామ పెద్దలు తెలిపారు. శనివారం మధ్యాహ్నం దేవాలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహింపబడుతుందన్నారు సాయంత్రం వేణుగోపాల స్వామి దేవాలయం ప్రాంగణం నుండి అమ్మవారికి పట్టుచీర గజమాల ఇతర పూజ సామాగ్రిని సంప్రదాయ బద్ధంగా ఊరేగించుకుంటూ ఎల్లమ్మ దేవాలయంలో సమర్పించడం జరుగుతుందన్నారు. రాత్రి ఎల్లమ్మ ఆసాది కథ చెబుతారని అన్నారు. తెల్లవారుజామున ఎల్లమ్మకు దున్నపోతును బలిసి జాతర కార్యక్రమం నిర్వహింపబడుతుందని తెలిపారు.

# యోగా చేయండి ఆరోగ్యంగా ఉండండి




**ఒంటిమిట్ట మే 30 ప్రభాతవార్త**

ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యోగాంధ్ర కార్యక్రమాన్ని శుక్రవారం తెల్లవారుజామున ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి ఆలయ ఉద్యానవనంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి కడప ఆర్డీవో జాన్ ఎర్విన్, హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రతినిత్యం యోగాసనాలు చేస్తూ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని సూచించాడు. యోగాసనాలు చేయడం వల్ల ఆరోగ్యం మెరుగు పడడమే కాకుండా మానసిక ఉల్లాసము మనసు ప్రశాంతత కలిగి ఉంటుందన్నారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించేందుకు దేవాలయాలు చక్కని వేదికగా నిలుస్తాయని దైవచింతన కూడా పొందవచ్చున్నారు. జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం నాటికి యోగ శిబిరాలు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. యోగా చేయడం ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలన్నారు. యోగపై ఉపయోగాలు కూడా తెలుసుకొని అవగాహన కలిగి ఉండాలన్నారు. అధికారులకు, ప్రభుత్వానికి ప్రజల సహకారం తోడైతే ఎటువంటి కార్యక్రమాన్ని అయినా పండుగలాగా నిర్వహించవచ్చన్నారు. యోగా వల్ల శారీరక శ్రమ పోగొట్టుకొని ఆరోగ్యంగా ఉంటూ తమ మనసును ఆధ్యాత్మిక వైపుకూ దారి మళ్లించవచ్చున్నారు. యోగాసనాల కార్యక్రమం ప్రతి మండలంలో ప్రతి గ్రామంలో పాఠశాలల్లో కళాశాలల్లో నిర్వహిస్తే యోగ ప్రాధాన్యత గురించి అందరికీ తెలుస్తుందని ఆచరణలో పెట్టడానికి సులువైన మార్గమన్నారు. యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం నిర్వహించినందువల్ల వాటి విలువలను తెలుసుకోవడమే కాకుండా ప్రత్యక్షంగా ఆస్వాదించడం జరుగుతుందన్నారు. ప్రతిరోజు కేవలం 30 నిమిషాలు తెలుసుకొని యోగాసనాలు వేస్తే శరీరం దృఢత్వం పెరుగుతుందని మానసిక శాంతి కలిగి ఒత్తిడిని అధిగమించవచ్చున్నారు. వైద్య సిబ్బంది ఆరోగ్యం కొరకు కొన్ని విషయాలు ప్రజలకు తెలియజేయడం జరిగింది. వివిధ అధికారులు వారి వారి హోదా ప్రకారం యోగ పై ప్రాముఖ్యతను వివరించారు. యోగ కార్యక్రమానికి పుర ప్రజలు సైతం హాజరు కావడంపై యోగాంధ్ర కార్యక్రమం ఒంటిమిట్టలో దిగ్విజయం కావడానికి ప్రతి ఒక్కరూ సహకరించినందుకు అధికారులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలపడం జరిగింది. ఉత్సాహభరిత యోగాసనాలు అధికారులను ప్రజలను ఉత్తేజితులను చేసింది .ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఓబులమ్మ,డిపిఓ రాజ్యలక్ష్మి, ప్రత్యేక అధికారి బ్రహ్మయ్య, ఎంపీడీవో గౌస్ బాషా, తాసిల్దార్ వెంకటరమణమ్మ, డిప్యూటీ తాసిల్దార్ అంజన గౌరీ, ఒంటిమిట్ట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గజ్జల .నరసింహారెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి .బొబ్బిలి రాయుడు, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వాలంటరీలు, విద్యార్థులు, తదితర మండల అధికారులు, పుర ప్రజలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదం... మంత్రి తీవ్ర దిగ్భ్రాంతి



**కురబలకోట, మే 30 ప్రభాతవార్త**

అంగళ్ళ సమీపంలో శుక్రవారం కారు డివైడర్లకు డి కొట్టడంతో అక్కడికక్కడే ఒక వ్యక్తి మరణించడం జరిగింది. ఇందులో నలుగురికి గాయాలయ్యాయి. మృతుడు రాయచోటి లక్ష్మి థియేటర్ వెనక కాపురం ఉంటున్న నవాజ్(24). వివరాల్లోకి వెళితే...సుహేల్ కువైట్ నుంచి రాత్రి బెంగళూరుకి వచ్చాడు. అక్కడి నుంచి కారులో పికప్ చేసుకుని స్నేహితులు ఐదు మంది కలిసి రాయచోటికి వస్తుండగా కురబలకోటలో ప్రమాదం జరిగింది. ప్రమాద ఘటనపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అనంతరం మంత్రి మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ వాహనదారులు అతివేగంగా ప్రయాణించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహనాలు నడిపే సమయంలో రోడ్డు నిబంధనలు పాటించి డ్రైవింగ్ చేయాలన్నారు.

# మహానాడు సభ సక్సెస్

**మదనపల్లి మే 30 ప్రభాతవార్త**

కడపలో గురువారం జరిగిన మహానాడు బహిరంగ సభ విజయవంతానికి సహకరించిన నియోజకవర్గ ప్రజలందరికీ ధన్యవాదాలు అంటూ ఎమ్మెల్యే షాజహాన్ బాషా తెలిపారు. శుక్రవారం బెంగళూరు బస్టాండ్ లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడు రోజులు పాటు కడపలో జరిగిన మహానాడు కార్యక్రమానికి నియోజకవర్గ నుంచి వచ్చిన టిడిపి నాయకులకు,కార్యకర్తలకు ప్రత్యేక అభినందనలు ఉన్నారు. బహిరంగ సభ విజయవంతానికి భారీ వాహనాల్లో ప్రజల రావడం సంతోషకరమన్నారు. మహానాడు సభ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపిందన్నారు. మదనపల్లి మున్సిపాలిటీ, రూరల్ మండలం,నిమ్మనపల్లి రామసముద్రం మండలాలకు చెందిన టిడిపి కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు అన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ చైర్మన్ విద్యాసాగర్,రాష్ట్ర మైనార్టీ నాయకులు ఎస్‌ఏ మస్తాన్ కౌన్సిలర్ ఆర్కే రామకృష్ణ తులసి రామకృష్ణ, రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు పటాన్ ఖాదర్ ఖాన్, సుధాకర్ జివి నాయుడు జెసిబి వేణు జెసిబి మధు పాల్గొన్నారు.



# అన్నమయ్య వరదబాదిత గ్రామాల్లో నేతల పర్యటన

**రాజంపేట అర్బన్, మే30 ప్రభాతవార్త**

ఒకవైపు సీఎం, మరోవైపు డిప్యూటీ సీఎం, అన్నమయ్య ప్రాజెక్టు పున నిర్మాణానికి ఒకరు హామీ, మరొకరు పునరావాస గ్రామాల బాధితులకు బాసట. ఒక్కసారి అన్నమయ్య ప్రాజెక్టు పరివాహక గ్రామాల్లో కదలిక. భూ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలతో రాజంపేట మండలంలోని తొగురుపేట, మందపల్లె, పులపత్తూరు హరిజనవాడ గ్రామాలలో అన్నమయ్య డ్యామ్ బాధితుల సమస్యలు తెలుసుకునేందుకు శుక్రవారం ప్రభుత్వ విప్, రైల్వే కోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్, రాజంపేట నియోజకవర్గం జనసేన నేతలు యల్లటూరు శ్రీనివాస రాజు, అతికారి కృష్ణ,జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, జనసేన నాయకులు జనసైనికులు , వీరమహిళలు, ప్రభుత్వ అధికారులు పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు నివేదించేందుకు నోట్ చేసుకున్నారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ అన్నమయ్య డ్యామ్ బాధితుల పట్ల గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం చూపిందన్నారు. అన్నమయ్య డ్యామ్ విషాదం రాష్ట్రాన్ని కుదిపేసిన ఘోర ఘటనగా చరిత్రలో నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయంలో గత ప్రభుత్వం బాధితులకు తగిన పునరావాసం, సాయం కల్పించడంలో తీవ్రంగా విఫలమైందని విమర్శించారు. ప్రజలు ఇప్పటికీ ఎన్నో సమస్యలతో పోరాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యంగా పని చేస్తోందని హామీ ఇచ్చారు.జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు, పౌర సరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ పర్యవేక్షణలో అన్నమయ్య డ్యామ్ బాధిత గ్రామాల్లో పునరావాసం, హౌసింగ్, రహదారులు,నీటి సదుపాయం, విద్యుత్ ఇతర అవసరమైన మౌలిక వసతుల ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్ష కొనసాగిందని తెలిపారు.ఈ సమగ్ర నివేదికలను ఉపముఖ్యమంత్రికి సమర్పించి బాధితులకు న్యాయం జరగడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, వీరమహిళలు , స్థానిక గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



జనసేన నేతలు శ్రీనివాసరాజు, అతికారి కృష్ణ, ఎమ్మెల్యే అరవ శ్రీధర్



బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న జనసేన నేతలు

## ఆధునిక వ్యవసాయ పద్ధతులతో మంచి దిగుబడులు పొందవచ్చు

**లక్కిరెడ్డిపల్లి మే 30 ప్రభాత వార్త**

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో మంచి దిగుబడులు పొందవచ్చు అని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ పేర్కొన్నారు వికసిత కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ ఉద్యానవన ప్రకృతి వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్ కు మంచి వర్షాలు కురుస్తున్నాయని వేసవిలోనే వ్యవసాయ లోదుక్కులు చేసుకుంటే పురుగు బయట పడి పంట సాగులో మంచి దిగుబడులు పొందవచ్చు అన్నారు ఈ ఖరీఫ్ కు ప్రభుత్వం నుంచి వేరుశెనకాయలు అందిస్తామని ఆయన తెలియజేశారు ఆధునిక కొత్త వంగడాలు కదిరి, లేపాక్షి వంటి విశిష్టమైన రకాలను సాగు చేసుకోవచ్చని ఆయన తెలియజేశారు వీటివల్ల వేరుశనగలు మంచి దిగుబడులు పొందవచ్చు అన్నారు. ఈ ఏడాది కరీఫ్ కు జిల్లా వ్యాప్తంగా 36 వేల క్వింటాళ్ళు వేరుచెనక్కాయలు జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాలకు పంపిణీ చేశామన్నారు కే 6, నారాయణి, కదిరి, కె ఎస్ కె, నాలుగు రకాల విత్తన కాయలు అన్ని రైతు భరోసా కేంద్రాలకు పంపిణీ చేశామన్నారు లోతుక్కులు చేసుకున్న తర్వాత జూన్ 15వ తేదీ నుంచి జూలై 15 తేదీ లోపల భూమిలో విత్తనాలు వేస్తే మంచి దిగుబడులు వస్తాయని ఆయన తెలియజేశారు.యాంత్రికరణ పరికరాలు డ్రీమ్లు 80 శాతం సబ్సిడీతో ప్రభుత్వ అందిస్తుందని వీటిని రైతులు సద్వినం చేసుకోవాలన్నారు అలాగే వేరుశనగ తో పాటు నవధాన్యాలు , 30 రకాల కి ట్స్ ను రైతులకు పంపిణీ చేస్తామన్నారు కంది పంట ఆముదము మినుము అలసంద వంటి ప్రత్యామ్నాయ పంటలు కూడా సాగు చేసుకోవచ్చన్నారు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శిల్పకళ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సాయిల్ హెల్త్ కార్డు మరియు ప్రకృతి వ్యవసాయ గురించి తెలియజేశారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త బసవరాజు మాట్లాడుతూ ఆముదంలో ఐ సి హెచ్ 5 ,6 రకాలు ఆముదాలు సాగు చేస్తే 90 రోజుల్లో మంచి దిగులు ఇస్తాయని హెక్టారుకు 11 నుంచి 16 కింటోళ్ల దిగుబడులు వస్తాయని 46, 48 శాతం నూనె శాతం వస్తుందన్నారు ఈ కార్యక్రమంలో ఏడిఏ జయరాన్ని ఏవో రమేష్ బాబురావు ఉద్యానవన శాఖ అధికారి నాగమణి, ఏఈఓలో అనూష కరోలిన్ రైతు భరోసా కేంద్రాల క్షేత్రస్థాయి సిబ్బంది వ్యవసాయ ప్రకృతి వ్యవసాయ ఉద్యానవన సిబ్బంది పాల్గొన్నారు.



విత్తనాలను పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్

## కిషోరిలకు ఆర్థిక సాక్షరతపై అవగాహన.



**చిట్వేలి, మే 30, ప్రభాతవార్త:**

కిషోరి వికాసం వేసవి శిబిరం 8 సెషన్ లో భాగంగా శుక్రవారం చిట్వేలి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో సిడిపిఓ నిర్మలా జ్యోతి ఆధ్వర్యంలో ఆర్థిక సాక్షరతపై బాలికలకు అవగాహన కల్పించారు. సిడిపిఓ మాట్లాడుతూ ప్రతి మహిళా ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబంలోనూ, సమాజంలోనూ గుర్తింపు గౌరవం ఉంటుందన్నారు. చదువుతోపాటు ఆర్థిక విషయాల్లోనూ చురుకుగా ఉండాలన్నారు. అవసరాల అనుగుణంగా ధనాన్ని ఖర్చు చేయాలని, ఉన్నంతలోనే పొదుపు చేయడం అలవర్చుకోవాలని కిషోరిలకు సూచించారు.పొదుపు ఒక మంచి అలవాటు మాత్రమే కాదు "అది భద్రత, స్వావలంబనకు తొలి అడుగు" అన్నారు. బాలికలు తమ భవిష్యత్తు ఆర్థికంగా ఎదిగేందుకు వారిచే పొదుపు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు వసుంధరమ్మ, విఒఎ లత, ఏఎన్ఎం ఆశావర్కల్లు, హెల్పర్, కిశోరి బాలికలు పాల్గొన్నారు.

## ప్రజా దర్బార్‌ను సద్వినియోగపరచుకోవాలి



**రాయచోటి, మే 30 ప్రభాత వార్త**

ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని సద్వినియోగపరుచుకోవాలని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని స్టేట్ గెస్ట్ హౌస్ నందు నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తమ సమస్యలను మంత్రివర్యులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు ప్రజల అర్జీలను స్వీకరించి ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి అక్కడికక్కడే సమస్యలు పరిష్కరించడం జరిగింది. దీంతో అర్జీదారులు మంత్రివర్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముగిసిన మాతమ్మ తల్లి తిరుణాల..

**సుండుపల్లె, మే 30, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని పెద్ద మాదిగ పల్లెలో వెలసి ఉన్న మాతమ్మ తల్లి తిరుణాల ఉత్సవాలు గురువారం ఉదయం నుండే ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు ఉదయాన్నే ప్రత్యేక పూలు, పట్టు వస్త్రాలు మరియు బంగారు ఆభరణాలతో అలంకరించి అభిషేకములు మరియు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గావు పట్టుట, పుట్ట బంగారు తెచ్చి పూజించడంతోపాటు పొంగు పాలు తెచ్చి పొంగ పెట్టడం, సిద్దులకు ఒక్కపొద్దు వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు . మొక్కుబడుల్లో భాగంగా రాత్రి డప్పు వాయిద్యాలతో కోలాటాలతో బాణసంచా కాలుస్తూ రంగురంగుల విద్యుత్ దీపాలంకరణ తో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసేందుకు చాందిని బండ్లు ఏర్పాటు చేశారు.

### మహానాడు జయప్రదం చేసిన వారందరికీ

# ప్రత్యేక కృతజ్ఞతలు

**బద్వేలు, మే 30, ప్రభాతవార్త**

కడప జిల్లా చింతకొమ్మదిన్నె మండలం పబ్బాపురంలో జరిగిన మహానాడుకు బద్వేలు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేసిన నాయకులు, కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త రితేష్ రెడ్డిలు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ మినీ మహానాడు కార్యక్రమంలో తాము ఇచ్చిన పిలుపుమేరకు పెద్ద సంఖ్యలో ప్రజలు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావడం అభినందనీయమని పేర్కొన్నారు. పార్టీపై ప్రజలు చూపిస్తున్న అభిమానం ఎనలేదని, వారి ఆశీస్సులు ఎల్లవేళలా ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. ఇ్న దుకు కృతజ్ఞతగా నియోజకవర్గ ప్రజల కోసం మరియు టిడిపి కార్యకర్తల కోసం తాము అహర్నిశలు కృషి చేస్తామన్నారు. గతంలో బద్వేలు టిడిపి కంచుకోటగా పార్టీ ఉండేదని, దానిని మరలా పునరావృతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మీ అందరి సహాయ సహకారాలు ఇలాగే కొనసాగి జరగబోయే అన్ని ఎన్నికలలో తెలుగుదేశం పార్టీని గెలిపించి ముఖ్యమంత్రికి బహుమతిగా ఇద్దామన్నారు. టిడిపి పూర్వ వైభవానికి ఎల్లవేళలా కృషి చేస్తూ నియోజకవర్గ సమస్యలను పరిష్కరించేందుకు ముందుంటామని తెలిపారు. రానున్న రోజులలో మీ ప్రేమ, అభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ సమస్యలన్నింటినీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని, తమ పిలుపుమేరకు మహానాడు జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికి మరోసారి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## కందుల గ్రూప్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (kgcet) 2కె 25 ఫలితాలు






**కడప మే 30 ప్రభాతవార్త**

కెఎస్ఆర్ఎం కెఎల్ఎం, వరుసగా 5వ సంవత్సరం విజయవంతంగా నిర్వహించిన KGCET. 2025 ఫలితాలను కందుల గ్రూప్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి మరియు కరస్పాండెంట్ కందుల రాజేశ్వరీ విడుదల చేశారు. మే నెల 1 2 తేదీలలో నిర్వహించిన పరీక్షలకు 2223 మంది హాజరు కాగా 1719 అర్హత సాధించారని తెలిపారు . ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వర్గీయ (శ్రీ కందుల శివానంద రెడ్డీ జ్ఞాపకార్థం ) సరైన విద్యా అవకాశాలూ లేని గ్రామీణ విద్యార్థులను గుర్తించి , విద్యా , వృత్తి ఆశయాలను సాధించే కృషికి ముఖ్య పాత్ర పోషిస్తూ, వారి అభివృద్ధి , సామర్థ్యా అంచనా వేయడం, ప్రతిష్టాత్మక కందుల గ్రూప్ అనుబంధ సంస్థ లో ప్రవేశం పొందే అవకాశం. మరియు సౌకర్యాలు, స్కాలర్షిప్ లు అందించడం మా ముఖ్య ఉద్దేశం అనీ గడిచిన 4 సంవత్సరాలకు గాను 12000 పై చిలుకు విద్యార్థులు పరీక్షకు హాజరు అయ్యారు, వారికి 15 లక్షల విలువైన ఉచిత విద్య , వసతి , రవాణా మరియు ఉచిత స్కాలర్షిప్ లు అందించడం జరిగింది .మా kgcet ద్వారా ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థికి మెరిట్ స్కాలర్షిప్ రూపేణ ప్రతి సంవత్సరం 3500 నుండి 10000 వరకూ పొందుతున్నారు అని తెలిపారు. ఈ ఏ పి సెట్ ద్వారా సాధించిన రాంక్ ఆధారంగా అభ్యర్థులకు స్కాలర్ షిప్స్ ఇ వ్వడం జరుగుతుందని వివరించారు మరియు వారి తల్లిదండ్రులకు, ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, ట్రెజరర్ శ్రీమతి కందుల రాజేశ్వరమ్మ, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని), ప్రిన్సిపల్ డాక్టర్ వీ.ఎస్.ఎస్ మూర్తి, కే.ఎల్.ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యం.వి రత్నమ్మ, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ సెల్ విభాగ సీనియర్ ఆఫీసర్ శ్రీ ఆర్ నాగరాజు, కేజి సెట్ 2కే25 కన్వీనర్ శ్రీ అలగల హరికృష్ణ , డీన్ ఆఫ్ అడ్మిషన్స్ టి. కిషోర్ కుమార్ గారు, కేజీసెట్2కే 25, నిర్వాహక సిబ్బంది, వివిధ విభాగాదిపతులు, టెక్నికల్ స్టాఫ్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరుల పాల్గొన్నారు.

## ఇంటి నిర్మాణం జీవితంలో ఓ ముఖ్యమైన ఘట్టం

**మదనపల్లి మే 30 ప్రభాతవార్త**

ఇంటి నిర్మాణం జీవితంలో ముఖ్యమైన ఘట్టమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు అన్నమయ్య జిల్లా మదనపల్లి లోని న్యూ బైపాస్ రోడ్డు రాయల్ వుడ్ ఎదురుగా కొండ్రెడ్డి శంకర్ రెడ్డి నూతనంగా నిర్మించిన శ్రీనిధి విల్లాస్ గృహప్రవేశంలో మంత్రి పాల్గొన్నారు. గృహప్రవేశంలో మంత్రి పూజలు నిర్వహించి కుటుంబ యజమానిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇలాంటి శుభకార్యాల్లో పాల్గొనడం ఎంతోసంతోషకరమన్నారు. అనంతరం మంత్రిని కుటుంబ యజమాని కొండ్రెడ్డిశంకర్ రెడ్డి దంపతులు గజమాలతో సత్కరించారు మంత్రి మాట్లాడుతూఇంటి నిర్మాణం జీవితంలో ఒక ముఖ్యమైన ఘట్టంమని ఇలాంటి శుభకార్యాలలో పాలుపంచుకోవడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు మంత్రివర్యులకు గజమాలతో ఘన స్వాగతం పలికారు. మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా గృహప్రవేశంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు కుటుంబ యజమాని శంకర్ రెడ్డి ఘన స్వాగతం పలికారు ఈ కార్యక్రమంలో మదనపల్లి, తంబళ్లపల్లి, పీలేరు పుంగనూరు నియోజక వర్గాల్లోని ప్రముఖులు పాల్గొన్నారు.



# వేసవి క్రీడా శిక్షణ కార్యక్రమంలో మంత్రి






**రాయచోటి, మే 30 ప్రభాతవార్త**

రాష్ట్రవ్యాప్తంగా నెల రోజులుగా కొనసాగిన వేసవి క్రీడా శిక్షణా కార్యక్రమం ముగింపు వేడుక శుక్రవారం రాయచోటి పట్టణంలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి , శిక్షణలో పాల్గొన్న వ్యాయామ ఉపాధ్యాయులకు చెక్కులు మరియు మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, క్రీడాకారుల అభివృద్ధికి అన్నివిధాలా తోడ్పడుతుందని అన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలలోనూ రాణించి, రాష్ట్రానికి గౌరవం తీసుకురావాలన్నారు. రాయచోటి ప్రాంతానికి క్రీడల పట్ల ఉన్న గుర్తింపును మరింతగా అభివృద్ధి చేసి, ఈ ప్రాంతాన్ని "క్రీడా హబ్"గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా స్పోర్ట్స్ డెవలప్మెంట్ ఆఫీసర్, శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డా. మి. సుధాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ డా. వి. బాలాజీ, అధ్యాపకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

